

# చీకటి

అల్లం శేషగిరిరావు

చీకటి... డక్ షూటింగ్...

బాతుల వేటకి కెప్టెన్ వర్మ బయలుదేరాడు. రిటైరైన వర్మ విడోవర్. ఊరవతల పెద్ద బంగళా ఉంది. అందులో  పూర్వం దొరలుండేవారు. వయస్సు మళ్లినా దిట్టంగా ఉన్నాడు. ఒక్క కొడుకూ విదేశాల్లో చదువుకొంటున్నాడు. ఇద్దరు పని మనుషులు.

"నాకు మహావృక్షాలంటే మహా ఇష్టం. అవి ముసలి చెట్లయి వుంటే మరీ ఇష్టం. అవి చాలా తరాల నుంచి వాటి మీద గూళ్లు కట్టుకున్న ఎన్నో జాతుల పక్షుల్ని, ఈ బంగళాలో కాపురమున్న విభిన్న సంస్కృతుల మనుషుల్ని చూసుంటాయి. నేను ఈజీ ఛైర్‌లో వరండా మీద కూర్చుని పైపు కాల్చుకుంటూ వాటన్నిటినీ ఆ ముసలి చెట్లలో చూడగలను.

"నాకు ఇన్‌ట్యూటివ్ నాలెడ్జ్ ఉంది. పూల మొక్కలంటారా? నో... ఫెమినిన్," అని అప్పుడప్పుడు విజిటర్స్‌కి బంగళా ఆవరణలో ఉన్న పెద్దపెద్ద చెట్లని చూపిస్తూ చెబుతుంటాడు.

పైపు- పొయెట్రీ- విస్కీ- సోడా అతనికి ఇష్టం. విక్టర్ హ్యూగో అభిమాని. అతనికున్న వ్యసనం ఒక్కటే! వేట- ముఖ్యంగా డక్ షూటింగ్. 'గ్రీనర్స్' డబుల్ బేరల్ షాట్‌గన్ భుజానికి తగిలించుకొని హంటింగ్ సూట్‌లో బంగళా మెట్లు దిగాడు. గదిలో నౌకరు లైటు ఆర్పేశాడు. చుట్టూ చీకటి- ఎటుచూసినా చీకటి. తొలిసంధ్య ముందు విస్తరించుకునే చిక్కని చీకటి. దూరంగా కొండల్లో నుంచి వచ్చిన గాలుల్లో ఊపిరి పోసుకుంటున్న చీకటి.

ఆవరణలో ముసలి మఱ్ఱిచెట్టు మీద రాబందుల రెక్కల చప్పుడు.

'అగ్లీ- బట్ గ్రేస్‌ఫుల్ బర్డ్- విశాలమైన రెక్కలు. గూని నడకలో హుందాతనం,' పొయెటిక్‌గా నెమరు వేసుకుంటూ సన్నగా ఈలలు వేశాడు. భౌ! భౌ!- యజమాని ఈలకి రిట్రీవర్ డాగ్ పరుగెత్తుకుంటూ వచ్చి కాళ్ల దగ్గర మూలుగుతూ, కాళ్ల చుట్టూ తిరుగుతోంది. "కమాన్- కమాన్ లెటజ్ గో," అని దాన్ని నిమిరాడు. ఉండుండి చలికి ఒళ్లు దులపరించుకుంటోంది.

యజమాని, కుక్క వేటకి బయలుదేరారు. యజమాని తుపాకీతో వేటాడిన బాతుల్ని ఈదుకుంటూ నీట్లో నుంచి ఒడ్డుకి తెస్తుంది- హంటింగ్ డాగ్. దాని పేరు సీజర్.

చీకట్లో ఇద్దరూ నడుస్తున్నారు. పొలాల్నీ తాటి తోపుల్నీ దాటుకుంటూ కాలవగట్టు ఎక్కారు. కాలువ గట్టు మీద రెండు నీడలు నడుస్తున్నట్లున్నాయి. గట్టు దిగి మొగలి పెండెల్లో నుంచి తంపరవైపు నడుస్తున్నారు. తంపర, తామర తీగలతోనూ, నాచుతోనూ, తుంగ గుబుర్లతోనూ, బురదతోనూ సుదీర్ఘంగా వ్యాపించిన సరస్సులా ఉంటుంది. బురద గుమ్ములు ఎక్కువ. నీటి లోతు మెడ దాటదు. అక్కడ నావల్ని గెడలతో తోస్తూ చేపలవేట చేస్తారు. నీటిపిట్టల జాతితో తంపర కార్తీకమాసంలో కిలకిలలాడుతుంటుంది. బాతులు మందలు మందలుగా విదేశాల నుంచి వలస వచ్చి దిగుతుంటాయి.

వర్మ, చలిలో హంటింగ్ సూట్‌లో వెచ్చగా వణుకుతున్నాడు. సీజర్ చలికి తుమ్ముతున్నప్పుడల్లా చీకట్లో తన మిలిటరీ చూపుల్తో మందలిస్తున్నాడు.

చీకట్లో సహితం యజమాని కదలికల్నీ, చూపుల్నీ తీక్షణంగానూ, నిశితంగానూ పసిగట్టే అనుభవం గల వేటకుక్క సీజర్.

ఇద్దరూ నడుస్తున్నారు. పొలాల్లో నక్కల మంద ఊళలు వేస్తోంది. ఎండ్రపీతల్ని పంట పొలాల్లో నక్కలు వేటాడుతున్నాయి. తంపర దగ్గరౌతోంది. చలిలో మంచు కూడా కలిసింది. ఉండుండి మొగలి డొంకల్లో నుంచి గాలి తెరలు రివ్వున వీస్తున్నాయి.

నిశ్శబ్దం...

''క్రాంక్- క్రాంక్,'' ఆకాశం మీద రెండు అరుపులు. వర్మ ఆగి ఆకాశంవైపు చూశాడు. కుక్క కూడా ఆకాశం వైపు చూసి మూలిగింది. ఆ అర్థం దాని యజమానికి మాత్రమే తెలుసు. నక్షత్రాలు పరుచుకున్న నల్లటి ఆకాశం మీద చాలా ఎత్తున పాలపుంతని దాటు కుంటూ బాతుల మంద ఎగురుకుంటూ పోతోంది. ''క్రాంక్,'' మళ్లీ మరో బాతు బొంగురు అరుపు. చుక్కల వెలుగులో నల్లటి బాతుల మంద. వాటి రెక్కల చప్పుడు స్పష్టాస్పష్టంగా రంయ్‌మని గాలితెర వీస్తూ పోయినట్లు వినబడుతోంది. తంపర్లో దిగుతాయి.

చీకట్లో మాటులోకి చేరుకోవాలి- గబగబా మళ్లీ నడక ప్రారంభించారు.

*

చీకటి...

పిట్టల వేటకి బయలుదేరాడు నక్కలోడు.

వాడి పేరు డిబిరిగాడు. చేతిలో నాటు తుపాకీ. భుజానికి తగిలించిన పాత మురికి కాకీ సంచి. పిట్టల వలతో చీకట్లో తంపరవైపు నడుస్తున్నాడు. ఎడమ చంకలో యజమానితో వేటకి బయలుదేరిన పెంపుడు కొంగ కూడా ఉంది. పెద్ద జాతి కొంగ- నత్తగొట్టు. దాన్ని చంకలో అదిమి పట్టుకొనున్నాడు.

డిబిరిగాడి నివాసం పోలీసుస్టేషన్ దగ్గర మైదానంలో మఱ్ఱిచెట్టు. దానికి కట్టిన తారు గుడ్డ కిందే రాత్రి పడుకుంటాడు. ఒక్క డిబిరిగాడే కాదు, సంచార జాతోళ్లు అంతా అలానే ఉంటారు. రోజూ సాయంకాలం పోలీసు స్టేషన్‌లో హాజరు వేయించుకోవాలి. రాత్రి ఎప్పుడు పిలిచినా హాజరు కావాలి. చెట్ల కింద పడుకుంటారు. పగటిపూట పూసలూ, పిన్నులూ, ఎఱ్ఱి పూసలదండలూ, చర్మాలూ రోడ్డు పక్కన అమ్ముకుంటుంటారు. చీకటి పడిన తర్వాత ఇంత ఉడకబెట్టుకు తిని పోలీసుల్ని బ్రతిమిలాడుకొని వేటకి బయలుదేరుతారు. వేటాడిన చెవులపిల్లుల్నీ, నక్కల్నీ, వలలో పడిన పావురాల్నీ, కొంగల్నీ, కౌజుపిట్టల్నీ ఉదయాన్ని ఊర్లో అమ్ముతారు. వాళ్లే చర్మం ఒలిచి, వెంట్రుకలు దూసి అమ్ముతారు. పోలీసులకి కూడా పిట్ట మాంసం చేసి ఇస్తుంటారు. అయినా ఊర్లో ఎక్కడ దొంగతనం జరిగినా వాళ్లను అనుమానం మీద పోలీసుస్టేషన్‌కి లాక్కెళ్తుంటారు. నక్క మాంసాన్నీ, పిల్లుల్నీ కాల్చుకు తింటూ వాటి చర్మాల్ని అమ్ముకుంటారు. అందుకే వాళ్లని- 'నక్కలోళ్ల'ని పిలుస్తారు. 'నత్తిగొట్టోళ్లు' అనీ, 'పూసలోళ్ల'నీ కూడా పిలుస్తారు. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క పేరున పిలుస్తారు.

డిబిరిగాడి దగ్గర పెంపుడు కొంగ ఎప్పుడూ పక్కనే ఉంటుంది. ఊర్లో ఫుట్‌పాత్ మీద పూసలు అమ్ముతున్నప్పుడు కూడా వాడి పక్కనే మేసుకొంటూ ఉంటుంది. నత్తగుల్లల్నీ, చిన్న చేపల్నీ దానికి మేపుతుంటాడు. అది ఎగిరిపోదు. బాగా మచ్చిక అయిపోయింది. ఆకలిగా ఉంటే నేల మీద ముక్కుతో పొడుస్తూ డిబిరిగాడి వైపు గుడ్డిగా చూస్తూంటుంది. నడుస్తున్నప్పుడు ఎప్పుడూ చంకలోనే దాన్ని పట్టుకొని తిప్పుతుంటాడు.

డిబిరిగాడు నడుచుకుంటూ ఊరవతలికి వచ్చాడు. దూరంగా పోలీసుస్టేషన్‌లో లైటు మసగ్గా కనిపిస్తోంది. ఊర్లో అప్పుడప్పుడు కుక్కల అరుపులు. డిబిరిగాడికి గోచీ తప్ప ఒంటి మీద మరేమీలేదు. వయసు అరవై దాటి ఉండొచ్చు. సిగ ముడి, కణితి మీద కాల్చిన మచ్చ, చెవి రింగుల బరువుకి సాగి వేలాడుతున్న చెవి తమ్మెలు, చేతి మీద పులి పచ్చ బొట్టు, సరైన తిండి లేక ముడుచుకొనిపోయిన కండలు, జ్ఞానం తెలిసినప్పటి నుంచీ పోలీసుస్టేషన్లో తిన్న లాఠీదెబ్బలతో కదుంకట్టి గట్టిపడిపోయున్నాయి. వాడి శరీరం ఎండావానలకి, చలిగాలులకి, ఆరుబయట జీవితానికి బాగా అలవాటుపడిపోయింది. వాడొక్కడే కాదు, ఆ సంచార జాతులన్నీ యిలానే జీవిస్తుంటాయి. ఈరోజు యీ ఊరు, మరోరోజు మరో ఊరు. తల్లి ఒక ఊరిలోను, తాత పాముకాటుకి మరో ఊరిలోను, తండ్రి దిక్కుమాలిన చావు మరో దగ్గర- అలా వారి చావులూ బ్రతుకులూ దిక్కుమాలినవే! అడివిలో సంచరించే జంతువుల్లా జనారణ్యంలో సంచరిస్తూ ఎక్కడో, ఎప్పుడో అనామకులుగా రాలిపోతారు. అనుభవిస్తున్నది దరిద్రమని వాళ్లకి తెలియదు. వాళ్ల శరీరంలాగే వాళ్ల జీవితాలు కూడా దరిద్రానికి అలవాటు పడిపోయాయి.

చీకట్లో నల్లటి తాటి తోపుల్లో నుంచి ఊరవతల స్మశానం దాటుతున్నాడు. అక్కడ దేవులాడుతున్న నక్క డిబిరిగాడి అలికిడి విని పొదల్లో నుంచి పారిపోయింది. చీకట్లో చలిగాలి డిబిరిగాడి మోటు శరీరాన్ని గరుకుగా తాకుతోంది. చంకలో కొంగ గింజుకుంటుంటే, "థూ- నీయమ్మ," అని ఒక చరుపు చరిచాడు. చీకట్లో అది కేరుమని అరిచింది.

పొద్దెక్కడానికి ఇంకా చాలా టైముంది. డిబిరి గాడు తంపరవైపు నడుస్తున్నాడు. చీకట్లో వల పన్నాలి. సంచీలో నుంచి నాటుసారా సీసా తీసి డగ్‌డగ్‌మని గుటకలేస్తూ సగం తాగి మూత బిగించాడు. ఒళ్లు వేడెక్కింది. బీడీ వెలిగించాడు. అడ్డదారిన చెరువు గట్టు మీద ఏపుగా పెరిగిన నల్లటి చెట్ల మధ్య నుంచి బరు వెక్కిన చిక్కటి నీడలా గబగబా నడుచుకుంటూ వెళు తున్నాడు. తంపర గాలి రివ్వున వీస్తోంది. గాలిలో తామరాకుల వాసనకి డిబిరిగాడి చేతిలోని కొంగ కూడా చీకట్లో నుంచి గుడ్డిగా తంపరవైపు చూస్తూ మెడ నిక్కించి రెక్కలు సర్దుకుంటోంది.

డిబిరిగాడు తంపర దగ్గరౌతున్న కొద్దీ మరింత వేగంగా నడుస్తున్నాడు.

*

నీలాకాశం చీకటితో స్నానం చేసినట్లు స్వచ్ఛంగా ఉంది.

చుక్కలు అక్కడక్కడ చలిలో వణుకుతున్నాయి.

తంపర ఒడ్డున మొగలి డొంకల మధ్యలో, ముందే ఏర్పరిచిన అరప మీద కెప్టెన్ వర్మ, సీజర్ కూర్చున్నారు. తూటాలు నిండిన జోడుగుళ్ల తుపాకీ పక్కన ఉంది. మొగలి పొదల్లో నుంచి అరప మీద కూర్చున్న వర్మకి విశాలంగా పరుచుకున్న తంపర చీకట్లో మసగ్గా కనిపిస్తోంది. ఆవలివైపు సరుగుడు తోటల్లో నుంచి గాలులు వీస్తున్నాయి. తంపర మీద నిశ్శబ్దం ఆవరించుకొనుంది. వర్మ ఆకాశంవైపు, నీటి వైపు కళ్లు పొడుచుకు చూస్తున్నాడు. చీకటి మరింత చిక్కగా పేరుకొంటోంది. సీజర్ చలికి వర్మకి మరింత దగ్గరగా తోసుకుంటూ వెచ్చగా ముడుచుకొంటోంది.

దూరంగా నీటిలో తుంగ గడ్డి గుబుర్లలో ఏదో కదులుతున్నట్లు అనిపించింది. వర్మ పరికించి చూస్తు న్నాడు. నల్లటి గుబుర్ల మధ్యలో ఏదో దీపం కదులు తున్నట్లుంది. గడ్డిలో వెలుగు ఉండుండి కనిపిస్తూ మళ్లీ కనుమరుగౌతోంది.

అలా చూస్తున్న వర్మకి రివ్వున శబ్దం వినిపిం చింది. చెట్లలో నుంచి వీస్తున్న గాలిలా లేదు. ఆకాశం మీద నుంచి దిగుతున్న మెత్తని గాలిలా ఉంది. బాతుల మంద తంపర్లో దిగబోతోంది. చుక్కల కాంతిలో బాతుల మంద మరింత స్పష్టంగా కనిపిస్తోంది. 'క్యాంక్'- మందలోని బాతు సన్నగా అరిచింది. ఆ అరుపుకి సమాధానంగా వర్మ కూర్చున్న అరపకి కాస్త దూరంలో తంపర్లో నుంచి బాతులు, 'క్యాక్, క్యాంక్... బాక్'మని అరుస్తున్నాయి. వాటి అరుపులతో అంత వరకు ఆవరించుకున్న నిశ్శబ్దం చిట్లిపోతోంది. బాతుల మంద బాగా కిందికి దిగి నీటి మీద వాలడానికి చక్కర్లు కొడుతున్నాయి. అలా రెండు మూడు రౌండ్లు కొట్టి నీటిలో దిగడానికి రయ్‌మంటూ వర్మ కూర్చున్న అరప దాటుతుండగా... అరప మీద నుంచి చీకట్లో రెండు మెరుపులు ధన్... ధన్... రైట్ అండ్ లెఫ్ట్ బేరల్సులో నుంచి తుపాకీ నిప్పులు కక్కింది. ఆ శబ్దం క్షణంసేపు నీటి మీద ప్రతిధ్వనించి నీరసిస్తూ దూరమైపోతూ గాలి హోరులో కలిసిపోయింది. ధప్- ధప్- ధప్-మని మంటి ముద్దల్లా చచ్చిన బాతులు, మందలో నుంచి తెగి నీట్లో పడ్డాయి. గింగురులు తిరుగుతూ రెక్కలు కొట్టు కుంటూ దెబ్బతిన్న బాతులు నీటిలో పడి చీకట్లో ఎగర లేక కొట్టుకుంటున్నాయి. కార్డయిట్ పొగలేని వాసన గాలిలో తేలుతోంది. ఒడ్డున కప్పలు టపటపమని నీట్లో గెంతేసి ఈదుకుంటూ దాక్కుంటున్నాయి.

సీజర్ మెరుపు వేగంతో తుపాకీ పేలీ పేలగానే అరప దూకి చీకట్లో దూసుకుంటూ నీట్లో దిగింది. మోర పైకెత్తి వాసన పసిగడుతూ యీదుకుంటూ పడిన బాతుల్ని పట్టుకుని ఒడ్డుకి తెచ్చే ప్రయత్నంలో ఉంది. చీకట్లో నాచు తీగల్లో కుక్క చిక్కుకుంటుందేమోనని వర్మ అరప మీది నుంచి ఈలలు వేసి పిలిచేస్తున్నాడు. కుక్క కోసం ఆందోళనగా వుంది. నీట్లో కుక్క ఈదు కుంటూ డైవ్ చేస్తున్న చప్పుడు. అలా పావుగంట గడిచింది. చచ్చిన బాతుల్ని నోట కరుచుకుంటూ ఒడ్డు ఎక్కింది. చిన్న పరుగుతో అరప దగ్గరికి వచ్చి వాటిని పడేసి యజమానిని రమ్మన్నట్లు ముద్దుగా మొరిగింది. ఆయాసపడిపోతూ తడిసిన ఒంటిని విదిలించుకుంటూ తుమ్ముతోంది. వర్మ అరప దిగి కుక్కని ఆప్యాయంగా నిమురుతూ అది తెచ్చిన బాతుల్ని పట్టుకున్నాడు. మూడు చచ్చిన బాతులు, మిగతావి నీటిలో బుడగేసి తప్పించుకున్నాయి.

బాతుల్ని సంచీలో పెట్టి భుజానికి తగిలించు కున్నాడు. తుపాకీలో ఖాళీ తూటాలు తీసి కొత్తవి పెట్టి రిలాక్సింగ్‌గా అగ్గిపుల్ల గీసి సిగరెట్టు వెలిగించాడు. ఆ

తమకంలో వెనక నుంచి వస్తున్న పరద పిట్టల మందని గమనించలేదు. కుక్క రెస్ట్‌లెస్‌గా ఆకాశంవైపు చూస్తూ పరుగెత్తింది. వర్మ వెనక్కి తిరిగి తుపాకీ సర్దుకునే లోపల మొత్తం పరదల మంద రివ్వున వెనక్కి తిరిగి గాలిలా దూసుకుంటూ బెదురుగా అరుస్తూ పారిపోయింది. వర్మ తుపాకీ దించి కనీసం మూడు బాతులు పడినందుకు సంతోషంగా సిగరెట్టు కాల్చుకుంటూ కుక్కని వెంటేసుకుని తంపర గట్టుమీద నడుస్తున్నాడు. ఇంకా బాగా చీకటిగానే ఉంది. బాతులు దిగే సమయం మించిపోలేదు. ఇంకా ఛాన్సు ఉంది.

నీటి మీద పొగమంచు మెల్లమెల్లగా లేస్తోంది. దూరాన కొండల మీది నుంచి దిగిన మంచు కూడా గాలితో కలిసి ముసురుకొస్తోంది. చూస్తుండగానే అంతా తెల్లటి మంచుమయం. చీకటితో తడిసిన మంచు మెత్తగా నడుస్తున్న వర్మని రాసుకొంటూ చుట్టేస్తోంది. చలిలో ఒణుకుతున్నాడు.

దూరంగా తంపరగట్టు మీద మంచులోంచి ఏదో వెలుగు కనిపిస్తోంది. మంచులో తడుస్తూ వెలుగువైపు నడుస్తున్నాడు. అది చలిమంట. డిబిరిగాడు చలి కాగుతున్నాడు.

వర్మని దూరంలోనే చూసి లేచి నిలబడ్డాడు. మంట వెలుగులో డిబిరిగాడి ఆకారం పొగమంచులో ఊగుతున్న నల్లటి నీడలా చీకట్లో కనిపిస్తోంది.

''దండాలు దొరా. ఇసక మంచు. ఒళ్లు కొంచెం ఏడెక్కనీ. కూకో,'' అని గోచీ గట్టిగా బిగించుకొని కూర్చున్నాడు.

అపరిచితుడు, అందులోనూ అనాగరికుడు తనని అలా పలకరించడం ఇష్టంలేకపోయినా బాగా చలిగా ఉంది. ఉదయాన్నే మరోసారి డక్ షూటింగ్ అవకాశం కూడా వుంది. అయిష్టంగా కూర్చున్నాడు.

డిబిరిగాడు వర్మని పెద్దగా పట్టనట్లు వాడి మానాన వాడు చలి కాచుకుంటున్నాడు. చేతులు మంటల మీద పెట్టి రాసుకుంటున్నాడు. ఉండుండి మోకాలి మీద అరిచేత్తో కొట్టుకొని రుద్దుకొంటున్నాడు. పక్కనే ఉన్న లాంతరు ఒత్తి బాగా దించేశాడు. కిరసనాయిలు ఎంతుందో ఊపి చూశాడు. అలా చాలాసేపు వాళ్లిద్దరూ మాట్లాడుకోలేదు.

వర్మకి డిబిరిగాడు చాలా విచిత్రంగా కనిపించాడు. పొట్టీ కాదు, అంత పొడవూ కాదు. ముదురుతున్న వయస్సుతో శరీరం చిక్కినా, ఒడిలిపోలేదు. చీపి కళ్లు మాత్రం అడవి జంతువు కళ్లలా తీక్షణంగానూ, పరిశీలనగానూ కదులుతున్నాయి. ముఖంలో ఫ్లూయిడ్ ఎక్స్‌ప్రెషన్. మంట వెలుగులో అప్పుడప్పుడు వాడి జిడ్డు తేరిన చెక్కిళ్లు ఎగిరిపడుతున్నాయి.

తుంగ గడ్డి గుబుర్లు, గాలి వీచినపుడల్లా బుడగలు కక్కుతూన్న జుంయ్‌మనే ధ్వని. వర్మ ఏమీ తోచక డిబిరిగాడిని మాటల్లోకి దించాడు.

''నీది ఏ ఊరు?''

''ఊఁ?'' అని తంపర మీదికి పరధ్యానంగా చూశాడు. దూరంగా ఏదో గచ్చకాయలు గుటక వేస్తున్నట్టు పెద్ద పక్షి చప్పుడు చేసింది.

''గూడబాతు. చేపల్ని గాగలో గొగళిస్తోంది,'' అన్నాడు డిబిరిగాడు. టపటపమని పెద్ద రెక్కలతో నీళ్ల మీద కొట్టుకొంటూ ఎగిరిపోయి దూరంగా జమ్ము దుబ్బుల్లో వాలింది.

''పెలికన్!'' అన్నాడు వర్మ.

''ఊఁ...'' అని వర్మ అంతకు ముందు వేసిన ప్రశ్నకి సమాధానంగా, ''నక్కలోణ్ణి,'' అన్నాడు.

''ఏ ఊరు?''

''అన్ని ఊళ్లూ తిరుగుతుంటాం. ఎక్కడుంటే అదే మా ఊరు. ఈ భూమంతామాదే,'' అని ముడుకుల మీద చలికి చరుచుకుంటూ వర్మవైపు చూడకుండానే పకపక నవ్వి తుంచేసినట్టు ఆపేశాడు- నిశ్శబ్దం.

ఆ నవ్వు ఆనందంగానూ లేదు- వెకిలిగానూ లేదు- అదోలా అనిర్వచనీయంగా ఇన్‌కొహెరెంట్‌గా వుంది.

''ఇక్కడ ఈ రాత్రప్పుడు ఏం చేస్తున్నావు?''

''ఏటకి వచ్చాను. లాంతరు నెత్తినెట్టుకొని నీటిలో, బురదలో, తుంగల్లో, నాచులో చాలాసేపు తిరిగాను.''

''లాంతరా!'' ఆశ్చర్యంగా అడిగాడు వర్మ. డిబిరిగాడు కూడా వర్మవైపు ఆశ్చర్యంగా చూశాడు.

''దీపం ఎలుతుర్లో ఏట దొరా! లాంతరు లైటుకి పిట్టలు ఎగిరొచ్చి వాల్తాయి. మచ్చల పిట్టలు. రెక్కల మీద, వీపు మీద చుక్కలుంటాయి. ఆ జాతి పిట్టలు ఇక్కడివి కావు. చలికి ఎక్కడి నుంచో ఎగురుకొస్తాయట. ఈ ఏడు ఇక్కడ దిగుతున్నాయి. నిన్ననే చూశాను. ఈరోజు లాంతరు తెచ్చాను. చీకట్లో నేను కనిపించను. నీట్లోనే ఉంటాను. నా బుర్ర మీద లాంతరు మాత్రం కనిపిస్తుంది. లాంతరు దగ్గర వాలగానే కింది నుంచి నీట్లో నుంచి గబుక్కున లాగేయాలి. పక్క పిట్ట కూడా పోల్చుకోకూడదు. ఈ ఏటకి మంచి చేతివాటం కావాలి-

ఈ ఏటను చిన్నప్పుడు మా బాబు దగ్గర నేర్చుకున్నాను- కాళ్లని, రెక్కల్ని, పీకని ఒకేసారి చప్పుడు కాకుండా పట్టుకుని నీళ్ల కిందికి లాగేసి బుట్టలో దూర్చేయాలి.''

''పిట్టలు దొరికాయా?''

''రెండు మూడు దీపం ఎలుతుర్లో చెక్కర్లు కొట్టాయి. నా చెంపకి కూడా వాటి రెక్కలు రాసు కెళ్లాయి. చారల పిట్టలు దొరుకుతాయని సంతోష పడిపోయాను. కాని...''

''కానీ?''

''కానీ... నువ్వు దూరంగా జోడు నల్లీల తుపాకి పేల్చావు. ఆ శబ్దానికి అవి పారిపోయాయి. మరి దిగవు!'' అని అర్థంకాని నవ్వు మళ్లీ నవ్వాడు. కళ్లలో మాత్రం నీ ఏటతో నా ఏటకి దెబ్బకొట్టేశావనే నిస్పృహ వర్మకి కనిపించినట్టయింది. చీకట్లో అరప మీద నుంచి తుంగ గుబుర్లో కనిపించిన వెలుగు డిబిరిగాడి లాంతరని ఇపుడర్థమయింది. కొంచెం గిల్టీగా మనస్సు చివుక్కుమంది. తలదించుకొని పక్కనున్న ఎండు టాకుల్ని అప్రయత్నంగా ఆరిపోతున్న మంటల్లోకి వేస్తున్నాడు. మళ్లీ నిశ్శబ్దం. మంటల్లో ఆకులు చిట్లు తున్నాయి. 'నువ్వు వేట చేస్తున్న సంగతి తెలీదు... అయామ్ సారీ,' అని చెబుదామనుకుని తల పైకెత్తాడు.

డిబిరిగాడు సంచీలో నుంచి నాటుసారా సీసా తీసి గడగడ తాగేస్తుంటే వాడి గొంతుముడి కిందికీ పైకీ కొట్టుకోడం ఎగిసిన ఆకుల మంట వెలుగులో కని పిస్తోంది. సీసా దించి తుపుక్కున ఉమ్మి చేత్తో మూతిని రాసుకున్నాడు. ముఖం మీద కండరాలు ఎరుపెక్కి వణుకుతున్నాయి. కణతల కింద నరం చూస్తుండగనే ఉబ్బెక్కింది.

గట్టిగా ఒగిర్చాడు. ఊపిరి భారంగా పీలుస్తు న్నాడు. ఆకాశం వైపు చూస్తున్నాడు. శుక్రుడు ఉద యించాడు. మరో చంద్రుడిలా, నక్షత్రం కాంతి చిమ్ము తోంది. శుక్రుడు లోనించి ఉండుండి రంగులు మారు తున్నాయి. ఆకాశం కొత్త కాంతిని సంతరించు కొంటోంది.

డిబిరిగాడు తదేక ధ్యానంతో ఆ నక్షత్రాన్ని చూస్తున్నాడు. ముఖం విచిత్రానుభూతితో కాంతివంత మౌతోంది. ఈమాటు పెదాల మీద నవ్వు అస్పష్టంగా లేదు. సారా నిషాలో మత్తెక్కిన ఎర్రటి కన్నుల్లో కామం పొంగులు కక్కుతోంది.

ఒక్కసారి వేట సంగతి మర్చిపోయినట్లు మాట తుంచేసి గతంలోకి గంతేసినట్లు, ''దొరా... అటు సూడు... ఆ చుక్క... రంగులు మారుస్తోంది. రంకు చుక్క!'' అని కట్ట తెంచుకున్న ఉద్వేగంతో ఆ చీకట్లో కంగున అరిచాడు- ఎగూపిరి- ఆనందం- అవధులు దాటుతున్న మదపిచ్చి నవ్వు. ''ఆ చుక్కని చూస్తే ఆడదానికీ, అడివిలో పులికీ దూలెక్కిపోద్ది. కత్తిలాంటి కసి దీనియమ్మ...''

''లస్క్ టపక్... లస్క్ టపక్! ఆహ్వా! ఆహ్వా!'' అని గెంతుతున్నాడు. ''ఝుూం... ఝుంయ్... టపీకరిఝుూ... టపికరి... టపికరి,'' ఎగురుతున్నాడు.

''లఫాకిలపధన్... లఫాకిలపధన్...డ్రు... డ్రు... చడిక్...చడిక్!'' అని ఆంబోతులా బుసలు కొడు తున్నాడు. మంట వెలుగులో చెవి రింగులు ఉండుండి తళుక్కుమంటున్నాయి. అదేదో భాషలో అరుచు కుంటూ, గొణుక్కుంటూ పిక్కల్నీ తొడల్నీ చరుచు కుంటూ కసికసిగా నవ్వుకుంటూ భూమ్మీద పడి ముడుచుకొని మంట చుట్టూ దొర్లుతున్నాడు. వాడి వింత చేష్టలకి వింత అరుపులకి వంత పాడుతున్నట్లు సీజర్ కూడా అరుపు లంకించుకుంది. కుక్క అరుపుకి డిబిరిగాడు లేచి నించున్నాడు. తడిసిన గుఙ్జంలా ఒళ్లు విదిలించుకుని, అడుగులు తడబడుతూ, మెల్లగా తూలుకుంటూ నాటుసారా కంపు కొడుతూ దగ్గరగా వచ్చి వర్మ రెండు జబ్బలూ పట్టుకొని సరదాగా ఊపాడు. మందు ఎక్కువైపోయిందనుకున్నాడు మనస్సులో వర్మ.

''రెండు సీసాకాయిల్ని ఎత్తిగలను. కొంచెం వేడెక్కింది, అంతే,'' అని వర్మ మనస్సులోని ఉద్దేశాన్ని క్షణంలో పసిగట్టినట్లు అన్నాడు.

''ఆ చుక్కని చూస్తుంటే గుర్తుకొచ్చింది... లంజి కూతురు... ఏం ఫిటింగు దొరా...'' అని వర్మ వైపు బూతుగా చూసి కన్నుకొట్టాడు.

''నీ పెళ్లామా?''

''ఊహు... నేను... ఉంచుకున్నాను. ఛత్- ఛత్- కాదు, అదే నన్ను ఉంచుకుంది. మా జాతిది కాదు. అది పెద్ద జాతిదంట. సంచారితెగదే. మొగుడొది లేసింది. సోది చెప్పుకుంటూ ఊర్లంట తిరుగుతుండేది. నా పక్క చెట్టు కిందే ఒండుకునేది. మాకు మెల్లగా ఇలాకా కుదిరింది. తగులుకున్నాం. అప్పటి నుంచీ సచ్చిందాకా ఇద్దరం కలిసే ఊర్లు తిరిగాం. పగలంతా సోది చెప్పి గుంట నాకొడుకులికి, 'పిట్ట మందు' అమ్మి చాలా బియ్యం, డబ్బులు తెచ్చేది. నేను ఏటచేసి పిట్టల్ని, ఉడత చర్మాల్ని అమ్మి ఇంతో కొంతో తెచ్చేవోణ్ణి.

రాత్రి కాగానే పూటుగా తాగి పిట్టమాంసం తిని చెట్టు కింద కౌగలించుకు పడుకుండేవోళ్లం. తింగరి లంజ-ఒకొక్కసారి కస్సుబుస్సుమనేది. ఒకరోజు అడిగాను కదా నువ్వు అమ్ముతున్న 'పిట్టమందు' ఏంటీ అని. చెప్పాను కదు సారూ- తింగరిది- పొగరుమోద్ది. అబద్ధమాడదు. నిజం చెప్పదు. ఆ గుండని ఏ ఆడదాని మీద జల్లితే అది ఫిటింగులో పడిపోద్దట దొరా. అదేదో నాకు నమ్మకం కుదరలేదు. ఒకరోజు దానికి తెలీకుండానే దాని బుట్టలోంచి గుండ తీసి దానిమీదే జల్లినా. అంతే దొరా. మంచి ఎన్నెల కాస్తోంది. అర్ధరాత్రి. ఎండాకాలం. తాగీసి పడుకున్నాం. ఆ మగతలో ఏదో నీడ కదిలినట్ల యింది. ఇంకేటి, అది నా పక్కనలేదు. ఎదురుగా నిల్చో నుంది. ఒంటి మీద గుడ్డలేదు. ఎన్నెట్లో దాని సంకా, సన్నూ పిటపిటలాడిపోతున్నాయి. అది కూడా తాగీసుం దేమో! అది ఊపిరి తీస్తుంటే దాని బొడ్డూ, తొడలూ ఎగురుతున్నాయి. ఉండలేకపోయాను దొరా! నాకు ఎర్రెత్తిపోయింది. నేను కూడా గుడ్డలు ఊడదీసి ఇసిరి పారేసి అమాంతంగా దానిమీద పడి పట్టుకోబోయాను...

"లంజకొడకా! అంటూ- అసలే తింగరి లంజ-తన్నరాని చోట తన్నేసింది. 'అమ్మో' అని నొప్పితో కిరకిర లాడుతూ తొడల మద్దిన పట్టుకొని గింజుకుపోతూ దాని చుట్టూ గెంతాను. 'నక్కలంజికొడకా, నా మందు నాకే పెడ్తావురా పిచ్చి లంజికొడకా... ఆ మందుకి నాకు దూలెక్కిందనుకుంటున్నావా? కాకుల్ని చంపి, దాని పీకా కాళ్లు కోసేసి ఈకలు దూసేసి పావురాలు బొచ్చు అంటించేసి, పావురాలని అమ్మేస్తుంటే జనం కొనీ యడం లేదురా? అలాగే నా మందూనూ. నక్కల నా కొడకా నువ్వెంత మాయ లంజకొడుకువో- మొగు డొదిలేసిన్దాన్ని మరి నేనెంత కేటులంజనో పోల్చుకోలేక పోయావురా! నా మందుకి నాకే దురదెక్కి గుడ్డలిప్పీసా ననుకుంటున్నావ్. కాదురా, నా కొడకా- అటు చూడు- ఆ చుక్కని చూడు. అది మారుస్తున్న రంగులు చూడు,' అంటూ మీది నుంచి కింది దాకా దాని ఒళ్లంతా వెన్నెల్లో ఆ చుక్క మెరుపులో చూపిస్తూ ముందుకొచ్చింది. నాకు కసెక్కిపోయింది. అమాంతంగా దాని జుత్తు పట్టుకొని దాని కళ్లల్లోకి చూశాను. ఎరుపెక్కిన కళ్లు ఆ చుక్క వెలుగులో మరింత ఎర్రగా పొంగిపోతున్నాయి. కైపెక్కిన గాడిదలా దాన్ని ఒక్క తన్ను తన్నాను. 'అమ్మ లంజకొడకా,' అని నక్కలా మీదపడి భుజం కొరికేసింది. దాన్ని జుత్తు పట్టుకొని భూమ్మీద గొరగొర ఈడ్చు కుంటూ తన్నుకుంటూ చెట్టు దగ్గరకి ఈడ్చుకొచ్చాను. అలా చాలాసేపు తన్నుకున్నాం. కొట్టుకున్నాం. కొరు క్కున్నాం. కుమ్ములాడుకున్నాం. తరువాత దొరా! అప్పు డందుకొంది మజా! ఫిటింగులో దిగిపోయాం. ఫిటింగ్... లంజికి ఫిటింగులో కూడా తింగరితనమే. మామూలు ఫిటింగ్ కాదు దొరా. ఓహ్! దానిది గొప్ప పొగరుమోతు ఫిటింగ్!- లంజ మీదికి ఎక్కిపోయి ఛపక్ ఛపక్‌మని పెట్టని పుంజెక్కి కుమ్మేసినట్లు కుమ్మేసింది. గస్కీ మీద గస్కీ... గస్కీ... గొప్ప ఫిటింగ్ దొరా! అదీ, ఆ చుక్కలోని మజా," అని చీకట్లో చెయ్యి జాపుతూ సుదూరంగా ఆకాశంలో తళుక్కుమంటున్న శుక్ర నక్షత్రాన్ని చూపిం చాడు. డిబిరిగాడు అలా చెబుతున్నంతసేపూ ఒంటి మీద తెలివిలేనట్లుగా పూనకంలో ఉన్నట్లు చెప్పుకు పోయాడు.

"సంవత్సరం తిరక్కుండానే ఎర్రి నక్క కరిచే సింది. నక్కలాగా అరిచి అరిచి చెట్టు కింద సచ్చి పోయింది," అని చీకట్లోకి చూస్తూ చెబుతున్నప్పుడు ఏదో బాధని గుటకేస్తూ చెబుతున్నట్లనిపించింది.

నిశ్శబ్దం. "దాని జాతోళ్లుగాని, మా జాతోళ్లుగాని రాలేదు దొరా- నేనే దాని శవాన్ని భుజానికెత్తుకెళ్లాను. దాని నోట్లోంచి సొంగలు కారుతున్నాయి. ఊరవతల చెరువుగట్టు కింద గొయ్యి తవ్వి దాన్ని నా చేతుల్తోనే కప్పెట్టేశాను... లంజి కూతురు...!

"ఆ రాత్రి చెట్టుకింద దాని బుట్ట ఎదికాను. సవరాలు, ఫిట్టింగ్ మందు పొట్లాలు, పాత చీరలు అవే మిగిలిపోయాయి. అది నన్నొదిలీసి ఎలిపోయింది..." అని అప్రయత్నంగా అది చేతి మీద పొడిచిన పులి పచ్చ బొట్టుని చేత్తో రాసుకుంటూ చీకట్లోకి చూస్తూ చెబు తున్నాడు. "అలా కునుకు పట్టేసింది. నిద్దట్లో పక్కని చెయ్యేసా- ఎపుడూ బరువుగా తగిలేది. ఇపుడు నేదు. ఆ జాగా ఖాళీ చేసి వెళిపోయింది. చెరువు గట్టు దగ్గర దూరంగా పెద్ద నక్క అరిచింది. అరుపు. గతుక్కుమని పోయాను. కంగారెత్తిపోయాను. నా ఆడదాని పీనుగుని, ఇన్నాళ్లు నా పక్కన తొంగున్నదాన్ని గోతిలో నుంచి నక్కలు లాగేస్తున్నాయేమో... పీక్కుతింటున్నాయేమో!!

"తుపాకీ పట్టుకొని తుప్పల్నీ, డొంకల్ని దాటు కుంటూ, ఆ చీకట్లో పరుగెత్తుకుంటూ చెరువుగట్టు దగ్గరికి పరుగెత్తాను. దాని గోతి దగ్గర నక్కలు చీకట్లో కాట్లాడుకుంటున్నాయి. నా అలికిడి ఇని పారి పోయాయి.

"అప్పటికే గొయ్యి సగం తవ్వేశాయి. గోతిలోంచి దాని చెయ్యి నిటారుగా బయటకు తన్నుకొచ్చింది.

చీకట్లో నన్ను పిలుస్తున్నట్లు అనిపించింది సారూ! దాని గోతి దగ్గరే గుండేసి కొట్టేసుకుని సచ్చిపోవాలని పించింది...

"గొయ్యి చేతుల్తోనే తవ్వి మరింత పెద్దది చేసి, దాంట్లో దాని చెయ్యిని, శవాన్ని లోతుగా కుక్కాను. దాని ముఖం ఉబ్బిపోయింది. కుక్కుతున్నప్పుడు దాని ముక్కంట నోటంట నీళ్లు బొళబొళమని తన్ను కొచ్చాయి... పసరు కంపు. అలా నా ఆడదాన్ని మళ్లీ కప్పెట్టేశాను.

"తెల్లవార్లూ తుపాకీ పట్టుకొని గోతి కాడ కాపలా కాశాను.

"అప్పుడప్పుడు తుప్పల మధ్య నక్కల కళ్లు మెరుస్తుండేవి.

"తెలతెలవారుతుందనగా దూరంగా దుమ్ముల గొండు అరిచింది."

ఆ విషాదచరిత్ర వింటూ చుట్టూ చీకటి కూడా చచ్చుబడిపోయినట్లు అనిపించింది వర్మకి.

నిశ్శబ్దం...

డిబిరిగాడిది, వాడి జీవితంలానే భాష కూడా వేరు. సంచార జాతి. అన్ని ఏసలూ కలగాపులగం. అరవం, ఉరుదూ ముక్కలు, అక్కడక్కడ ఇంగ్లీష్ చమక్కులు వాడి జీవిత దర్పణంలా ప్రతిబింబిస్తు న్నాయి. ఆ నిశ్శబ్దంలో డిబిరిగాడి మాటల్ని తనకి అర్థమయ్యే భాషలో అనువదించుకుని మనస్సుతో అర్థం చేసుకుంటున్నాడు వర్మ. భాషా సంకెళ్లని తెంచు కొని రెండు మనస్సులు మాట్లాడుకొంటున్నాయి. కెప్టెన్ వర్మకి కళ్లు చెమరుస్తున్నాయి. చీకట్లో నాచు మీద కొక్కొక్కొ అని ముసలి కొంగ దగ్గింది. డిబిరిగాడు చెవులు రిక్కించి విన్నాడు. "దీనియమ్మ వస్తానుండు దొరా!" అని నేలమీది నుంచి నీట్లోకి దిగుతున్న మొసలిలా గట్టుమీద నుంచి తూలుకుంటూ బురదలో జారుకుంటూ తుంపర్లో దిగిపోయి ఈదుకుంటూ చీకట్లో మాయమయ్యాడు.

మంచు బాగా కురుస్తోంది. నక్షత్రాలు మంచు పొగల్లో నుంచి ఒక్కొక్కటీ మసక బారి వెలవెలబోతూ నీరసించి రంగు మారుతున్న ఆకాశంలోకి ఇంకిపో తున్నాయి. దూరంగా వేగుచుక్క మాత్రం ఊగుతోంది.

నీళ్లలో అలజడి.

కెప్టెన్ వర్మ ఒడ్డున మంటకి మరింత దగ్గరగా వచ్చాడు. డిబిరిగాడి సంచీ పక్కనే వాడి తుపాకీ కూడా ఉంది. నీడలో దాన్ని వర్మ ఇంతకుముందు గమనించ లేదు. వేటగాడు వర్మ తుపాకీ చూడగానే ఉత్సాహంతో దాన్ని తీసి పరిశీలనగా చూశాడు. పాతబడిన నాటు తుపాకీ, అందులోనూ దట్టింపు తుపాకీ. వాడకంలో ఉండటంవల్ల బాగా పాతదైనా జంగుపట్టక పనిచేస్తోంది. ఖాళీ తుపాకినీ సరదాగా భుజానికి ఆనించాడు. బాలెన్స్ సరిగాలేదు. సర్దుకుంటూ మంట వెలుగులో బేరల్ మీది నుంచి చీకటిలోకి గురి చూస్తూ విశాలమైన తంపర మీద గురి సారిస్తూ మెల్లగా తిప్పుతున్నాడు.

నీట్లో అలజడి. తుపాకి గురిలో నల్లటి నీడ నీట్లో నుంచి లేచింది. డిబిరిగాడు బురదలోంచి నాచును తొక్కుకుంటూ గట్టెక్కుతున్నాడు. వాడి భుజం మీద తడిసిన వల. చంకలో నత్తగొట్టు. చలిలో వణికిపో కుండా ఉన్నా గబగబా అంగలేసుకుంటూ వేడికి మంట దగ్గరికి వచ్చి కూర్చున్నాడు. వలని పక్కన పెట్టి నత్త గొట్టుని దగ్గరే ఎత్తి పడేశాడు. అది పడిన దగ్గరే కదల కుండా మంట వేడిలోకి చెవిటి చూపులు చూస్తోంది. డిబిరిగాడు ఒంటి మీద కారుతున్న బురద నీటితో మంటలోకి దూరిపోతున్నట్లు కూర్చున్నాడు.

తుపాకీ చేత్తో పుచ్చుకునే జేబులోంచి సిగరెట్టు తీసి, 'ఇంద కాల్చు,'మని ఇచ్చాడు వర్మ. డిబిరిగాడు మంట మీది నుంచి పక్కకి వంగి కాలుతున్న కట్టెపుల్లతో సిగరెట్టు కాల్చుకున్నాడు. మంట వేడికి ముఖం చిట్లించుకుని పొగకి దగ్గుతున్నాడు.

"సారూ, అది మర్డరీ తుపాకీ..." అని సిగరెట్టుని బీడీలా కాల్చుతూ అన్నాడు.

వర్మకి షాక్ కొట్టినట్లు అయింది. ఉలిక్కిపడి డిబిరిగాడికి అందించేశాడు.

"రెండు రోజుల్నుంచీ చూస్తున్నాను. ఇది బాగా బెదురెక్కిపోయింది. అరుపులో బెదురు. దీనియమ్మ దీనికేటొచ్చిందో అరవకుండా ఉండినా బాగుణ్ణు. గొంతులో సైతాన్ పట్టినట్లు దగ్గుతుంది. దీని అరుపు ఆలకించగానే ఆమడ దూరాన్నుంచే నత్తగొట్లు బెంబే లెత్తిపోయి దిగకుండా పారిపోతున్నాయి!"

దేన్ని గురించి ఈ విషయం మాట్లాడుతున్నాడో వర్మకి అర్థంకాక డిబిరిగాడి వైపు చూశాడు.

"ఇందాక దగ్గిందే, ముసలి దగ్గు. ఈ కొంగ లంజిదే. బెదురు కూత. ఈ అరుపు వింటే వచ్చిన పిట్ట కూడా రాదని వలనీ, దాన్నీ తెచ్చేశాను.

"ఈ నత్తగొట్టుని పెంచుతున్నావా?"

"నత్తగొట్లని పట్టడానికి పగలే వలెయ్యాలి. రాత్రిళ్లు నత్తగొట్లు చెట్ల మీదుంటాయి. పగలు తంపర్ల

లోనూ, చెరువుల్లోనూ, ఒడ్లంటా, పొలాల్లోనూ దిగుతాయి. అక్కడే వలేసి, దీన్ని వలమీద పెట్టి ఉంచుతాం. దీన్ని చూసి అక్కడ కూడా మేతుందని అవి కూడా వచ్చి వల్లో చిక్కడిపోతాయి. గాని దీనియమ్మ దీని అరుపు మారిపోయింది. బెదురు... బెదురు...'' అని దభాలున దాన్ని ఒక్క బాదుబాదాడు. అది నోరు జాపి 'కేర్'మని బాధగా కసిగా అరిచింది. దాని నాలిక ఎఱ్ఱటి పేలికలా వెలుగులో మెరిసి మూసుకుపోయింది. ముక్కుతో భూమ్మీద పొడుస్తోంది.

''నత్తగొట్లు రాత్రిళ్లు రావు కదా! మరి రాత్రి వలేశావు?''

చేత్తో వారిస్తున్నట్లు మాటల్ని ఆపాడు. ముడుకులు మీద కొట్టుకున్నాడు.

''రాత్రంతా నా పక్కనే ఎందుకని వలేసి పెట్టాను. ఒక్కొక్కసారి దీని అరుపుకి తెల్లారి పోయిందనుకుని చుక్క వెలుగులో కొంగలు, నత్తగొట్లు, అరుపు వైపు ఎగురుకుంటూ దిగిపోతాయి. గానీ సాధారణంగా రావు.

''గాని, సారూ, తుంగ గుబుర్లలో గూళ్లు కట్టుకున్న కొండ కోళ్లు, దాసరి కోళ్లు అనుమానంగా బయటికొచ్చి అరుపు వైపు ఈదుకుంటూ చీకట్లో కానుకోలేక వలలో చిక్కడిపోతాయి. పరదలు కూడా ఈ అరుపుకి అప్పుడప్పుడు దిగిపోతాయి గాని దొరా ఇందాక మంచి పరదల మందని నువ్వు బెదరగొట్టేశావు... నువ్వు... పరదల్ని...''

''నేనా...?''

''నువ్వు అరప దిగి అగ్గిపుల్ల గీసి సిగరెట్టు ఎలిగించలేదూ?''

''అవును, వెలిగించాను.''

''అగ్గిపుల్ల ఎలుగులో నీ తుపాకీ గొట్టాలు జిగేల్ మని మెరిశాయి. ఇంత దూరంలో నాకే కనిపించింది. బాగా నున్నగా మెరుగెక్కున్నాయేమో జిగ్‌మన్నాయి. చీకట్లో ఆ మెరుపుకి దిగబోతున్న పరదల మంద బెదిరిపోయి అరుసుకుంటూ గిఱ్ఱున వెనక్కి తిరిగి పారిపోయింది.''

డిబిరిగాడికి వేటలో గల నిశిత పరిశీలనాశక్తికి ఆశ్చర్యపడిపోయాడు వర్మ.

''ఈ నత్తగొట్టుకి రెక్కలు కత్తిరించేశావా?''

డిబిరిగాడు అదోమాదిరిగా వర్మవైపు చూస్తూ ఎడమచేత్తో చటుక్కున నత్తగొట్టుని పట్టుకొని దాని రెక్కల్ని సాగదీసి మంట మీద ఎత్తి పట్టుకున్నాడు. వేడికి అది కాళ్లు కొట్టుకుని గింజుకుంది. అలా దాని పెద్ద రెక్కల్ని చూపించి మళ్లీ నేల మీద దబ్బున పడేశాడు. అది కోడిలా రెక్కలు రెండుసార్లు కొట్టుకుని పడిన చోటనే నిటారుగా నిల్చుని మంటల్లో కాలుతున్న చితుకుల చిటపటల్ని వింటోంది.

''మరి అది ఎగిరిపోదా?''

''దానికి చూపులేదు, కళ్లు కనిపించవు.''

''గుడ్డిదా? దాని కళ్లు పొడిచేశావేంటి?'' ఆదుర్దాగా అడిగాడు వర్మ.

''లేదు. కనబడకుండా దాని కంటిరెప్పల్ని దారంతో కుట్టేశాను. అది ఎలుతురు చూడలేదు. పిట్టని మచ్చిక చేసుకోవాలంటే ముందు దానికి చూపు లేకుండా చేసేయాల.''

డిబిరిగాడు చెబుతున్నది ఆశ్చర్యంగా వింటున్నాడు వర్మ.

''ఏ జాతి పిట్టల్ని పట్టుకోవాలనుకుంటే ఆ జాతి పిట్టనే మచ్చిక చేసుకోవాలి. ముందుగా దానికి చూపు లేకుండా చేసేయాలి. వలేసి దాని మీద పెట్టాల. దాన్ని చూసి ఆ జాతి పిట్టలన్నీ భయం లేకుండా దాని దగ్గర దిగిపోయి వలలో తగులుకొని చిక్కడిపోతాయి. మచ్చిక చేసిన పెంపుడు పిట్ట వెలుతురు చూడకూడదు. చూస్తే ఎగిరిపోయి దాని జాతి మందలో కలిసిపోద్ది. చూపులేని పిట్టతో చూపున్న పిట్టల్ని వలేసి పట్టుకోవడం. అదే ఈ వేటలో తమాషా.''

అంతవరకు ఆసక్తికరంగానూ, ఆశ్చర్యంగానూ వింటున్న వర్మ ఇప్పుడు డిబిరిగాడు చెప్పిన దాన్ని లోతుగా ఆలోచిస్తున్నాడు. హంటింగ్ టాక్టిక్స్‌తో పాటు వాడు చెప్పిన దాంట్లో గల ఫిఫ్త్ కాలమ్ స్ట్రాటజీని, పొలిటికల్ ఇండాక్ట్రినేషన్నీ తన మిలిటరీ మేధస్సుతో విశ్లేషించుకుంటున్నాడు కెప్టెన్ వర్మ.

డిబిరిగాడు మంట సెగకి వంటి మీద ఎండిపోయిన బురదని బకురుకుంటూ దులుపుకుంటున్నాడు. తంపర్లో దూరంగా బార్... బార్...మని వెదురు గొట్టంలో నుంచి అరుస్తున్నట్లు గూడబాతు అరుస్తోంది.

''సారూ! నా తుపాకీ ఇందాక గురి చూస్తున్నావు- ఎలాగుంది బర్మార్? బాగానే కొడ్తాది కాని కుండా మాత్రం గాడిద తన్ను తన్నీస్తుంది. అటు పేలడం ఇటు కుండా జెబ్బకి గుద్దెయ్యడం, గుద్ది గుద్ది నా జెబ్బ కదుం కట్టిపోయింది!'' అని వాడి కాలర్‌బోను క్రింద వేలుపెట్టి నొక్కి చూపించాడు- అక్కడ కండ కదుంకట్టి ఎండిపోయిన నల్లటి మాంసం ముద్ద అంటించినట్లు బైటకి తోసుకొనొచ్చుంది.

డిబిరిగాడు నిలబడి, తుపాకి గుఱ్ఱం ఎత్తి గొట్టంలో నుంచి కాలిన మందుగుండు నుసి నిప్పిల్ నుంచి పోడానికి గట్టిగా నోటితో ఊదుతున్నాడు.

''అది మర్డర్ తుపాకీ అన్నావుకదా ఇందాక!... మర్డర్ చేశావా?''

డిబిరిగాడు భళ్లున నవ్వబోయి ఆపుకున్నాడు. గారబట్టిన పళ్లతో గిగిలిస్తున్నట్టు గుసగుసమని నవ్వాడు.

''నేను కాదు, నా తండ్రి... నా బాబు. ఈ తుపాకీతో ఒకే దెబ్బకి ఒకణ్ణి కూనీ చేశాడు,'' అని ఆ తుపాకీని రెండు చేతుల్లో పట్టుకొని మొదటిసారిగా ఆ తుపాకీని చూసినట్లు తనివితీరా చూశాడు. ఒక్కసారి ముఖం మీద నుంచి నీడ దాటినట్లు ముఖ కవళికలు మారిపోయాయి. పెదాలు ఆవేశంగా కదులుతున్నాయి. దవడలు గట్టిపడి బిగుసుకుంటున్నాయి. భారంగా మంట దగ్గర చతికిలపడ్డాడు. మంటల వెలుగులో నిప్పుకణికల్లా ప్రతిఫలిస్తున్న వాడి కళ్ల చూపులు విశాలంగా పరుచుకున్న చీకటిలో నుంచి చొచ్చుకుపోతూ గతాన్ని చూస్తున్నాయి.

డిబిరిగాడు గతాన్ని చెపుతున్నాడు-

''సాలాకాలం క్రిందట... అప్పుడు తెల్లదొరలుండేవోళ్లు. నేను చిన్నోడ్ని. ఇప్పుడైనా నా వయసెంతో నాకు తెలీదు. ఎన్నేళ్లంటే సెప్పలేను. మాకు పుట్టుకలు గుర్తుండవు. సావులు మాత్రమే గుర్తుంటాయి. నా తండ్రి సావు, నా ఆడదాని సావు ఇప్పటికీ గుర్తే... అదేదో ఊరు... పోలీసుఠాణా పక్కన మైదానంలో మా జాతోల్లందరూ చెట్ల కింద తారుగుడ్డలు కట్టుకొని వుండేవాళ్లం. నేను, నా బాబు వండుకునేవాళ్లం. మా అమ్మ అమ్మోరు పడి ఎప్పుడో సచ్చిపోయిందంట. నాకసలు గుర్తే లేదు. ఏటొడ్డున పడేసిన మా అమ్మ శవాన్ని రాబందులు పీక్కు తిన్నాయట... మా బాబు చాలా విచారంగా చెప్పేటోడు.

''ఒకరోజు ఏటికెళ్లిన మా బాబు చీకటిపడ్డా ఇంటికి రాలేదు. పిట్టల్ని పట్టడానికి వల తీసికెళ్లాడు. తుపాకీ తీసుకెళ్లలేదు. అడవి పందులకి పటాసు కాయలు పెట్టి పొలాల్లో రాత్రి కాసుక్కూర్చున్నాడేమో అనుకున్నాను. ఆ మరుసటిరోజు సూర్యుడు నెత్తి మీదకొచ్చినా రాలేదు. నేను బెంబేలెత్తి పోయాను. ఇంతలో పక్కనున్న మావోడు వచ్చి, ''ఏట్రా డిబిరిగా! ఏం చేస్తున్నావ్?... నీ బాబుని నిన్నటి నుంచి పోలీస్‌స్టేషన్‌లో కుళ్లబొడిచేస్తున్నారు!'' అన్నాడు.

''ఎందుకూ?'' అన్నాను.

''దొంగతనం చేశాడట. మాకూ పిలిపించి కొట్టి వదిలేశారు. నీ బాబు మీద ఇంకా అనుమానం తీరలేదు. మొన్న ఈ ఊరు షావుకారి ఇంట్లో దొంగతనం జరిగిందట. బంగారం పోయిందట. ఎక్కడ దాచావని గొడ్డును బాదినట్టు బాదుతున్నారు...''

క్షణంసేపు ఆగి కళ్లు మూసుకున్నాడు. నుదుటి మీద చిటికెలు వేసుకున్నాడు. తేరుకొని చెవి సందుల్లోంచి బీడి తీసి ముట్టించాడు. గట్టిగా దమ్ములాగి తిరిగి చెప్పడం మొదలెట్టాడు.

''మాకు పోలీసోళ్లతో దెబ్బలు తినడం చిన్నప్పటి నుంచీ మామూలే! ఎక్కడ దొంగతనం జరిగినా మమ్మేల్నే పట్టుకొని తంతారు. మా జాతోళ్లం దొంగతనం చెయ్యం. దొంగతనాలు చేసే జాతులు కూడా ఉన్నాయట! వాళ్లతోపాటే మమ్మల్నీ దొంగల కింద జమకట్టేసి కొట్లో తోసేసి మక్కలు ఇరగతంతారు. మేము మాత్రం దొంగతనం చేయం. ఏట చేస్తాం. ఉంటే తింటాం. లేకపోతే ఆకలితో పస్తుంటాం. చచ్చినా అడుక్కోం... గానీ సారూ నా జీవితంలో గతిలేక ఒకే ఒక్కసారి అడుక్కున్నాను. ఊ... ఆ సంగతి తర్వాత చెబుతానులే సారూ,'' అంటూ గెడ్డాన్ని చేత్తో బక్కురుకుంటూ తల పైకెత్తి శూన్యంలోంచి ఆకాశం మీదికి వెర్రిగా చూశాడు.

మంచు పలచబడుతోంది. చీకటిలో చిక్కదనం తగ్గుతోంది.

''నేను కంగారెత్తిపోయి పోలీస్‌స్టేషన్‌కి పరుగెత్తాను. అక్కడ దొరకాళ్ల మీద పడి మా బాబుని ఒదిలేమన్నాను. ఇలా అన్నానో లేదో ఆ పక్కనే వున్న పోలీసు బాబు, 'ఈడు ఆడి కొడుకే సార్. ఇప్పుడు ఆడు చెప్పేస్తాడు- ఛల్ నా కొడకా,' అని పిల్లిపిల్లను చెవి పట్టుకొని ఎత్తికెళ్లినట్లు నా జుత్తు పట్టుకొని ఎత్తి గొరగొరా ఈడ్చుకుంటూ కొట్లో తోసేశారు దొరా... దొరా!!...

''దొరా!'' అని గావుకేక పెట్టాడు. చుట్టూ ఆవరించుకున్న నిశ్శబ్దంలో చీకటి అద్దం గళ్లున పగిలినట్లైంది. వర్మ ఆ కేకకి నిశ్చేష్టుడైపోయి వింటున్నాడు. బాధతో అరిచిన అడవి మృగంలా వుంది ఆ కేక. డిబిరిగాడు ఒళ్లో వున్న తుపాకీ మీద తలపెట్టి కళ్లు మూసుకున్నాడు. అలా మూసుకున్న కళ్లకి గతంలోని ఒక భయంకర దృశ్యం కన్పించింది. అలా కళ్లు మూసు కునే చెబుతున్నాడు...

''దొరా! నా తండ్రిని రెండు చేతులూ చాచి కట్టేసి దూలానికి వేలాడదీసేశారు. గోచీ తప్ప వంటి మీద గుడ్డ లేదు. కాళ్లు కట్టేసున్నాయి. కొట్లో చీకటి చీకటిగా వుంది. లాంతరు వెలుగులో చూసేసరికి నా కళ్లు తిరిగి పోయాయి. దబ్... దబ్... ఫట్... దబాదబ్... లాఠీ

దెబ్బలు. వంటినిండా దెబ్బలు. అక్కడక్కడ చర్మం చిట్లి రక్తం ముద్ద కట్టేసింది. గావుకేకలు- కాళ్లు తన్నుకోలేక గింజుకుంటున్నాడు. దెబ్బలు ఆగడం లేదు.

''చెప్పరా! బంగారం ఎక్కడ దాచావో!''

''బాబూ... నాకు తెలీదు...'' నోటిలో మాట నోట్లోనే వుంది. మళ్లీ దెబ్బలు, కేకలు, బొబ్బలు- నోట్లో నుంచి రక్తం చొంగలా కారుతోంది.

''ఆపు- ఇప్పుడు చెపుతాడు వాడు ఎక్కడ దాచాడో- చూసుకో. ఇదిగోరా నీ కొడుకు. నీ ఎదుటే ఈడ్ని కొట్టి సంపేస్తాం... ఏం(రా చెప్పవా?'' ధన్‌మని నా బుర్ర గోడకేసి కొట్టేశారు. నేను పడిపోయాను. గుండెల మీద, కడుపులోనూ బూట్లతో కుమ్మేస్తున్నారు. లాఠీలతో కుళ్లబొడిచేస్తున్నారు.

''బాబోయ్ అన్నాను. అమ్మోయ్ అన్నాను. ఒక్కొక్క అరుపుకి ఒక్కొక్క దెబ్బ. క్రితం రాత్రి తిన్నది కక్కేసుకున్నాను. ఉచ్చేసుకున్నాను. జుత్తులో నుంచి కారిన నెత్తురు పెదాలకి ఉప్పగా తగుల్తోంది.

''నా అరుపులకి మా బాబు గెద్దకి రెక్కలు ఇరిసేసి దాని ఎదురుగానే దాని పిల్లని చుట్టుముట్టేసి సంపేస్తున్న బావురు పిల్లుల్ని చూసి అరుస్తున్నట్లు కోపంగా పీండ్రించుకుంటూ దూలానికి గింజుకు పోతున్నాడు.

''దొరా, అసలు ఎందుకు కొడుతున్నారో నాకు తెలీదు! నేనేం చేశాను? అంతా నాకు అయోమయంగా అనిపించింది. అంతా చీకట్లు కమ్ముతున్నాయి. నా వొంటి మీద దెబ్బలు వినిపిస్తున్నాయి. కాని బాధ తెలియడంలేదు. మగత కమ్మేస్తోంది. ఆ మగతలో చివరిసారిగా విన్న మాటలు.

''ఆపండి... అడ్ని ఒదిలెయ్యండి... నేను నిజం చెబుతాను, అని కిరకిరలాడిపోతున్న మా బాబు గొంతు.

''నవ్వులు...

''నాకు స్పృహ తప్పిపోయింది.

''తెలివి వచ్చేటప్పటికి పోలీసు కొట్లో మా మూలుగులు. కంపు, రొచ్చు, పక్కనే అన్నం, నీళ్లు. మా బాబు నీళ్లతో నా ముఖం కడిగాడు. ఏడ్చి ఏడ్చి తడారి పోయినట్లు ఆడి కళ్లు గాజుకళ్లలా వున్నాయి.

''తినండి నా కొడకల్లారా! తిని, ఎల్లి ఒంటికి కాపడం పెట్టుకొని పడుకోండి. రాత్రి పారిపోగలరు, జాగ్రత్త! రాత్రంతా మావోడు నీ డేరా దగ్గర కాపలా వుంటాడు. తెల్లారగానే నేనే వస్తాను. బంగారం ఎక్కడ దాచావో... పాతిపెట్టావో చూపుదువుగాని- అని నన్ను పట్టుకొని ఈడ్చుకెళ్లి బాదిన పోలీసుబాబు దబాయించి చెప్పాడు. దెబ్బలతో ఒళ్లు పచ్చిపుండులా వుందేమో అన్నం తినాలన్నా తినలేకపోయాను. అన్నం ముద్దల్ని చేత్తో పట్టుకోలేకపోతున్నాం. వేళ్లు వాచిపోయున్నాయి. సలుపులు. కడుపులో ఆకలి మాడ్చేస్తుందేమో తినలేక తినలేక ఇంత తిని నీళ్లు తాగాం.

''మరేం ఫర్వాలేదు. ఈళ్లెక్కడికి పారిపోరు. ఈ కొట్లోనే ఉంచితే మొండి నా కొడుకులు మొండికేసి అసలు చెప్పడం మానేసి నాకు తెలీదు అని మళ్లీ మొదటికొస్తారు. మనం వదిలేసినట్లు నమ్మకం కలిగించాలి. అప్పుడు పూర్తి నిజం చెప్పేస్తారు... కొంచెం నిఘా ఉంచు రాత్రంతా- అని పక్కగదిలో ఇంకో పోలీసుతో గుసగుసలాడడం కొట్లో నుంచి బయటికి వస్తున్న నాకు వినిపించింది.

''ఒరే, మేమెంత పోలీసోళ్లమైనా, మా డ్యూటీలో ఎంత కొట్టినా మేమూ మనుషులమేరా! మాకూ కనికరం ఉంటుంది. టీ తాగుతారేట్రా?

''ఒద్దన్నట్లు తలూపి, నేనూ మా బాబు కొట్లో నుంచి బయటకొచ్చాం. ఒళ్లు తూలిపోతోంది. అప్పటికే చీకటిపడింది. చెట్టుకింద కొచ్చాం. నేనే లాంతరు ఎలిగించాను. మా తండ్రి పెదాల్లో నుంచి కారుతున్న నెత్తురుని చేత్తో ఒత్తుకుంటున్నాడు. కాపడానికి వేడి నీళ్లు పెట్టనా అన్నాను. ఒద్దన్నాడు.

''ఎండాకాలం చల్లగాలి వీస్తోంది.

''బాబా, నువ్వు దొంగతనం చేశావా?- అని అడిగాను. దానికి సమాధానంగా నా జుత్తుని నిమురుతూ 'నువ్వు పడుకో' అన్నాడు. నాకు నిద్ర పట్టేసింది. ఒకటి రెండుసార్లు తెలివి వచ్చి చూసేసరికి నా బాబు నా పక్కనే కూర్చుని నా ముఖంలోకి చూస్తున్నాడు. తెల్లవారుజాము మగతనిద్రలో నా కాళ్లు పడుతున్నట్లు కూడా అనిపించింది. ఆడు రాత్రంతా పడుకోలేదు.

''తెల్లారి నేను లేచేసరికి ఆడు ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. రాత్రంతా నిద్రలేమితోనూ అంతకు ముందు తిన్న దెబ్బలతోనూ బాగా అలసిపోయినట్లున్నాడు. ముఖం కమిలిపోయి నిప్పుల్లో కాలీకాలని కర్రపెండలం దుంప రంగులో ఉబ్బిపోయింది. ఏంరా, టీ తాగావా?- అని రెండు గ్లాసులతో టీ తెచ్చాడు, మాకు తెలీకుండా కాపలా కాస్తున్న పోలీసు. మా బాబు వాడివైపు ఎగాదిగా చూసి రెండు గ్లాసులూ అందుకున్నాడు. ఇద్దరం టీ తాగాం.

''సూర్యుడు ఉదయించాడు. డేరాలోకి చొచ్చుకు వస్తున్న సూర్యకాంతిని వాచిపోయిన చీపి కళ్లతో మా

బాబు చూస్తున్నాడు. వాడి చూపుకి అడ్డంగా నీడలా, నన్ను ఈడ్చుకెళ్లిన పోలీసు వచ్చాడు.

"ఏంట్రా? వెళ్దామా? ఇంకా టీ కావాలా? అన్నాడు పోలీసు. అప్పి కూడా మా బాబు కింద నుంచి మీదకి చూశాడు. లేచి నుంచున్నాడు. ఒళ్లు బద్ధకంగా విదిలించుకున్నాడు. పోలీసుని చూసిన మా బాబు ఎప్పుడూ లేనిది మెత్తగా నవ్వాడు. పెదాలు నవ్వు తున్నాయి. కళ్లు మాత్రం క్రూరంగా చూస్తున్నాయి. అంతే- మెరుపు వేగంతో పక్కనున్న తుపాకీ అందు కున్నాడు.

"ధూమ్... నాటుతుపాకీ గుళ్లను కక్కింది- పోలీసు ఆమడదూరాన డేరా నుంచి ఎగిరిపడ్డాడు.

"రాత్రి ఒకటికి రెండు బార్‌లు మందుపోసి గుళ్లు దట్టించి ఉంచిన తుపాకీ సూర్యోదయాన వాడి గుండెల్ని చీల్చేస్తూ గర్జించింది. ఆ శబ్దానికి చెట్ల మీద కాకులు అర్చుకుంటూ మందమందలుగా ఎగురు తున్నాయి.

"పోలీసు శవం నెత్తుటి మడుగులో పడి వుంది. ఖలీజా బయటకు వచ్చేసుంది. చుట్టుపక్కల వారంతా గుమికూడి తోసుకుంటూ ఆ శవాన్ని చూస్తున్నారు. నాటు తుపాకీ మందు వాసన గాలిలో తేలుతోంది. మా తండ్రి దగ్గరికి ఎవరూ రాలేకపోతున్నారు. చేతిలో ఇంకా పొగలు కక్కుతున్న తుపాకీ వుంది. అలా తుపాకీతో మరి వెనక్కి తిరిగి చూడకుండా అందరు చూస్తుండగా నడుచుకొంటూ పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్లాడు- దొరా! నిన్న నేను దొంగతనం చేసానని ఒప్పించాడే అది పచ్చి అబద్ధం. నేను దొంగతనం చేయలేదు. ఇప్పుడు నేను ఖూనీ చేశాను. ఇది పచ్చి నిజం. నేను చంపాను. అందుకే చంపిన తుపాకీతోనే లొంగిపోతున్నాను. ఇదుగో తుపాకీ- ఇంకా వేడిగానే వుంది. పొగలు కక్కు తోంది- అని పోలీస్ ఇన్‌స్పెక్టర్ బాబు ముందు మా బాబు లొంగిపోయాడు.

"మా బాబుని మూసేశారు. ఎక్కడో జైలుకి తీసు కెళ్లిపోయారు. నేను ఒంటరివాడ్ని అయి పోయాను," అంటూ నిట్టూరుస్తూ కథ ముగించినట్లు లేచి నించు న్నాడు డిబిరిగాడు. తుపాకీగొట్టంలోంచి మరొక్కసారి గాలి ఊదాడు. సంచీలోంచి వెతికి చిన్న డబ్బీ తీసి అందులో నుంచి తుపాకీమందు గొట్టంలో పోసి కాయితాలు కూరి దట్టిస్తున్నాడు... అలా దట్టిస్తూనే మళ్లీ మొదలుపెట్టాడు.

"నాకు మర్డర్ కేసులో సాచ్చిగా ఏశారు. కేసు పైసలా అయ్యేదాకా ఆ ఊరు కదలొద్దు అని కట్టడి చేశారు. రోజూ పోలీస్‌స్టేషన్‌లో హాజరీ ఏయించు కోవాల. కొత్తలో పిచ్చిగా అటూ ఇటూ తిరిగాను. మావోళ్లు ఇంత అంబలి పోసేవాళ్లు. సంచార జాతోళ్లం కదా, వాళ్లు కూడా ఊరు విడిచిపెట్టి వెళ్లి పోయారు. నేను బతకాలి కదా! నాకు అప్పటికి తుపాకీ ఏట తెలియదు... వలేసి పిట్టల్ని పట్టి ఊరులో అమ్ము కునేవాడ్ని."

మరో డబ్బా తీసి అందులోని సీసపు రవ్వల్ని తుపాకీ గొట్టంలోకి పోసి కాయితం మడిచి ఇనుప రాడ్‌తో సద్దుతున్నాడు. దట్టించలేదు... "సారూ! రవ్వలు నింపిన తర్వాత దట్టించకూడదు. మందు మీద కూరుతూ సద్దాలి. తుపాకీ పేలగానే రవ్వలు జల్లిడిలా విడిపోవాల... ఎక్కువ పిట్టలు పడతాయి," అంటూ నాటు తుపాకీలోని టెక్నిక్‌ని కెప్టెన్ వర్మతో చెపు తున్నాడు. తుపాకీల సంగతి తెలిసిన వర్మ ఆ నాటు తుపాకీ బాలిస్టిక్స్ గురించి ఆసక్తికరంగా వినడంలేదు. ఆ నాటు మనిషి జీవితంలోకి అన్వేషిస్తున్నాడు.

"నాలుగైదుసార్లు కోర్టుకు తిప్పారు. అబద్ధమాడ కూడదని పోలీసులు బెదిరించేవోరు. కోర్టులో ఏదో ప్రమాణకం కూడా చేయించీవోరు. నేను ఎందుకు అబద్ధమాడుతాను సారూ! నేను కళ్లారా మా బాబు పోలీసును చంపడం చూశాను. మా బాబే చంపేశాడని చెప్పాను.

"బోనులోంచి మా బాబు- ఒకే దెబ్బతో పైసలా చేసేశాను- అని ఉడుం బుస కొట్టినట్టు బుస కొట్టీ వోడు. మా బాబుని కలిసేవోడ్ని. సింహంలాంటి వోడు బక్కచిక్కిపోయాడు. గానీ డీలాపడిపోలేదు. నువ్వు నాకోసం బెంగెట్టేసుకోకు. తిరిగొచ్చేస్తాను. బాగా ఏట చెయ్యి... బాగా తిను. వంటి నిండా కండలు పెరగాలి. బలంగా వుండాలి. దెబ్బలు తిని తట్టుకోడానికి బలం కావాలి. మనవి దెబ్బలు తింటూ బ్రతికే బ్రతుకులు... అని కల్సిన ప్రతిసారీ చెపుతుండేవోడు. ఆ మాటలు చెపుతున్నప్పుడు మాటలు తడబడేవి. పెదాలు వణికేవి. కళ్లు కరకరమని చూస్తుండేవి."

సంచీలోంచి కేపు తీసి నిప్పిల్‌కి అమర్చి గుర్రం ఎత్తి జబ్బకి ఆనిస్తూ చీకట్లోకి గురి చూస్తూ...

"ఆ తర్వాత ఆడిని ఏదో పెద్ద జైలులోకి మార్చే శారట," తుపాకీ దించేసి పక్కన పెట్టి మంట దగ్గరగా వచ్చి కాళ్లతో ఎగతోసి కూర్చున్నాడు. పక్కనున్న మరిన్ని ఎండుటాకుల్ని దానిమీద పడేశాడు. నిప్పుల మీద అవి కరకరమంటూ భగ్గున మండుతున్నాయి.

"చాలారోజులు ఆడి సంగతే తెలీరాలేదు. చాలా చాలా రోజులు గడిచి పోయాయి. ఆరోజు నేను రోడ్డు పక్కన ఉడుం మాంసం వంతులేసి అమ్ముతున్నాను. ఒక కానిస్టేబుల్ బాబు వచ్చి- ఓరీ ఇక్కడున్నావట్రా. నీ చెట్టు దగ్గర చూశాను. రేపు ప్రొద్దుట నీ బాబుకి సెంట్రల్ జైలులో ఉరి తీస్తారట- కావాలంటె వెళ్లి చూసుకో- అని చెప్పి ఎలిపోయాడు.

"ఉరి... ఉరి... ఉరికంబం- నా బాబు... ఒళ్లంతా గజగజలాడిపోయింది సారూ!" అంటున్నప్పుడు వాడి శరీరం, మంట వేడిలో కమిలిపోయి, కాలిపోయే ముందు పొగలో మెలికలు తిరిగి పోతున్న ఆకులా ముడుచుకుపోతోంది.

"పెద్ద జైలు చాలా దూరం అన్నారు. బస్సులో ఎళ్లాలట. ఆరోజుల్లో బస్సులు కూడా ఎక్కువలేవు. బస్సెక్కడానికి నా దగ్గర డబ్బులు లేవు. ఉడుం మాంసం అమ్మిన బేడ డబ్బులు ఉన్నాయి. ఏం చేతును!... దిక్కుతోచడం లేదు- సారూ! అడుక్కున్నాను. నేను చెప్పాను కదా, నా జీవితంలో అడుక్కొన్నది ఒకే ఒక్కసారని... కనిపించిన అందర్నీ అడుక్కున్నాను. కాళ్లు పట్టుకున్నాను. 'ఎందు'కన్నారు. నా బాబుకి ఉరి తీస్తారు- నా బాబు ఖూనీ చేశాడన్నాను. 'మర్డర్ చేసినోడికి ఉరి తీసేయక మెడలో దండ వేస్తారా?' అన్నారు. ఈడి బాబు ఖూనీ చేశాడట- ఈడు ఖూనీ కోరోడి కొడుకు. అసలు వీళ్ల జాతోళ్లు దొంగతనాలు, ఖూనీలు చేసే జాతోళ్లట! ఈడూ ఖూనీలు చేసేవోడు లాగే వున్నాడు. ఉరితీసిన ఈడి బాబుని చూడ్డానికి డబ్బులు కావాలట?- ఎగతాళి చేశారు. చీదరించుకున్నారు. విసుక్కుంటూ తప్పుకుపోయారు. ఒకళ్లిద్దరు జాలిపడి కానీ పరక ఎత్తెత్తి నా చేతిలో పడేసిపోయారు. మొత్తం పావలా మించలేదు. ఆ డబ్బుతో వెనక్కి చూడకుండా బస్సు దగ్గరికి పరుగెత్తాను. అది కూడా ఎల్లిపోయింది."

*

నడి నెత్తిన సూర్యుడు చుర్రుమంటున్నాడు. డిబిరిగాడికి ఆకలి. వికారంగా వుంది. జోరుగా నడిస్తే మరుసటిరోజు పెద్ద జైలు దగ్గరికి వెళ్లచ్చునన్నారు. పరుగులాంటి నడక లంకించుకున్నాడు. ఊరు దాటిపోయాడు. పరుగెత్తుతున్నాడు. నడుస్తున్నాడు. చీకటి పడిపోయింది. ఆ రాత్రంతా పరుగెత్తుకుంటూ, నడుచుకుంటూ చుక్కలని చూస్తూ టైమ్ లెక్కెట్టుకుంటున్నాడు. రానురాను ఆకాశం మబ్బుపట్టింది. టైం తెలియడంలేదు. వర్షం- వర్షంలోనే పరుగు, నడక, ఆయాసం, ఆకలి, బెంగ, భయం. అలా వర్షంలో తడుస్తూనే పరుగెత్తుకుంటూ రెండు మూడు చిన్న పల్లెలు దాటాడు. వర్షం తగ్గిపోయింది. ఒక గుడిసె దగ్గర ఆగి ఒగరుస్తూ మంచినీరు అడిగాడు. దోసిట్లో కుక్కలా కతుకుతూ తాగాడు- పట్టణం ఎంత దూరం- అన్నాడు. ఇదే దారి, ఇంకా దూరం- అన్నారు. మళ్లీ నడక, పరుగు, నడక, పరుగు. తెలతెలవారుతోంది. కోళ్లు కూస్తున్నాయి. తెల్లారిపోయింది. వెలుగు బాగా వచ్చేసింది. పరుగు ఆపేశాడు. దొంగ అని పట్టుకుంటారేమోనని భయమేసింది. గబగబా నడుచుకుంటూ పట్టణంలోకి వచ్చేసాడు. వాకబు చేసుకుంటూ జైలు దగ్గరకు వచ్చాడు.

బాగా పొద్దెక్కిపోయింది. వళ్లు తూలిపోతోంది.

డిబిరిగాడు జైలు గేటు దగ్గర నుంచున్నాడు. మర్రిచెట్టు మీద గబ్బిలాలు అరుస్తున్నాయి. గేటు తలుపులోంచి జైలువార్డెన్లు అటుఇటు తొందర తొందరగా వస్తూ పోతున్నారు. కొందరు తెల్లబట్టలోళ్లు, ఒక తెల్లదొర గేటులోంచి బైటకు వచ్చి వెళ్లిపోయారు. వాళ్లకి జైలు పోలీసులు సెల్యూట్ చేశారు. వాళ్ల చేతిలో ఏవో కాయితాలు కూడా ఉన్నాయి.

"బాబూ..." అంటూ బెంగగా ఒక వార్డెన్‌ని పలకరించాడు.

"ఏం కావాలిరా, గుంట నాకొడకా, పొద్దునే?" అని విసుక్కున్నాడు.

"నా బాబుకి ఈరోజు ఉరిసిచ్చని కబురెట్టారు."

వార్డెన్ వాడి కళ్లలోకి చూసి పరధ్యానంగా తల దించుకున్నాడు. మరిద్దరు వార్డెన్లు వచ్చారు. 'ఇంత ఆలస్యమేందేంటి? తెల్లవారుజామునే ఉరి తీసేశారు.'

*

"ఉరి తీసేసారా? సచ్చిపోయాడా- సచ్చిపోడూ?- ఉరి తీసినోడు సవ్వకుండా బతికుంటాడా సారూ! అలా అప్పుడు ఎందుకు అడిగానో నాకు తెలీదు. బుర్రలో ఎర్రెక్కిపోయినట్లయింది."

*

డిబిరిగాడిని గేటు తలుపులోంచి చేయి పట్టుకు దాటించి లోనికి తీసుకెళ్లారు. వాడు నడుస్తున్నాడే గాని ఒంటి మీద తెలివిలేదు. అరుగు మీద కూర్చోబెట్టారు. డిబిరిగాడికి నెత్తురులోంచి మెల్లమెల్లగా మంచు పాకురుకుంటూ తెరతెరలుగా నసాళానికి గుద్దుతున్నట్లు అనిపించింది. మెడ మీద తలకాయ పట్టు

తప్పినట్లు గజగజా వణికిపోతోంది. ఎవరో టీ తెచ్చి తాగించారు. కొంచెం సర్దుకున్నాడు. చుట్టూ కొంచెం సేపు వెర్రివాడిలా అర్థంకాని చూపులు చూశాడు.

వార్డెన్ విస్తరాకులో రెండు జొన్నరొట్టెలు ఎదురుగా పెట్టి- తిను- అని ఒక బీడీ కూడా అందించాడు. ఆ రొట్టెల వైపు డిబిరిగాడు ఆశగానూ చూడలేదు. ఆకలిగాను చూడలేదు. అర్థం లేనట్టు చూస్తుండగానే...

"నీ బాబు నీకివ్వమని చెప్పాడు."

"మా బాబా? నాకివ్వమన్నాడా?"

కుదిపి వేసినట్లు లేచి కూర్చున్నాడు.

"ఉరి తీసేముందు నీ ఆఖరి కోరిక ఏమన్నా వుంటే చెప్పుకోమన్నారు జైలరు- నా కొడుకు రాలేదా? అన్నాడు- కబురుపెట్టాం. ఇంకా రాలేదు. ఏమైనా తింటావా?" అని అడిగాం.

"జొన్నరొట్టెలు," అన్నాడు. జొన్నరొట్టెలు తెప్పించాం.

"టైం అయిపోతోంది. ఆకులో రొట్టెల్ని చూస్తూ- బాబూ, నా కొడుకు ఇంకా రాలేదూ? రాలేదుగానీ వస్తాడు. రాత్రంతా తిండిలేక కడుపు నకనకలాడిపోతూ పరుగెత్తుకుంటూ వస్తాడు. ఆకలితో కరకరలాడి పోతుంటాడు. అసలే ఆడు ఆకలిగొట్టోడు. ఆకలితో వుంటాడు. ఈ రొట్టెల్ని వాడికియ్యండి బాబూ కడుపు నిండా తింటాడు. ఆకలితో వుంటాడు బాబూ. ఒక బీడీ ఇప్పించండి బాబూ- అని బీడీని గబగబా రెండు దమ్ముల్లో ఊదేశాడు. బాబూ, మరొక బీడీ! ఇది నా కొడుక్కి నేనిచ్చానని ఇవ్వండి బాబు. ఆడికి బీడీలంటే మాయిష్టం. ఇక నాకు ఏ కోరికా లేదు- అంటూ ఉరి కంబం ఎక్కిపోయాడు. చివరిసారిగా నీ కోసం ద్వారం వైపు చూశాడు. ముసుగు తొడిగేశాం. టైం అయిపోయింది. ఉరి తీసేశాం."

"నా బాబు ఏడ్చేడా? ఉరికొయ్య మీద గింజుకున్నాడా?" అని వార్డెన్ చేతులు పట్టుకొని వలవలా ఏడ్చాను.

*

అలా డిబిరిగాడు చెబుతున్న వాడి దీనగాథని మరింత హైలైట్ చేస్తున్నట్లు నక్కలు ఆకాశం వైపు మోరలెత్తి ఏడుస్తున్నాయి.

"ఆడు చావుకి జడిసి ఏడవలేదు సారూ. ఆడికి సావంటే భయంలేదు. నా మీద భ్రమతో, నేను ఆకలితో చచ్చిపోతాననే బెంగతో, వంటరిగాడ్ని అయిపోతాననే బాధతో ఏడుస్తూ ఉరికొయ్య మీద గింజుకొని వుంటాడు..." అని చెబుతున్నప్పుడు డిబిరిగాడి శరీరం లోంచి వాడి ఆత్మ వేరైపోయి కంటి ముందే చీకట్లో విలవిలా తన్నుకున్నట్లైయింది. వర్మ డిబిరిగాడి భుజం మీద చేయి వేసి ఓదార్పుగా తడుతూ సిగరెట్టు తీసి వాడి నోటికి అందించి వెలిగించాడు.

"ఆ సాయంకాలం మా బాబు శవాన్ని, జైలు తోటీవోళ్లు పక్కనే స్మశానంలో పాతి పెట్టేశారు. నేను కూడా వాళ్లతో మరింత లోతుగా గొయ్యి తవ్వి మా బాబు శవాన్ని ఎండాకాలం ఆవిర్లు చిమ్ముతున్న గోతిలో కప్పెట్టేశాను. అందరూ వెళ్లిపోయారు. చీకటి పడింది. ఆడు నాకోసం ఉంచిన రొట్టెల్ని ఆడి గోతికాడే కూర్చుని తిన్నాను. ఆడిచ్చిన బీడీ కాల్చుకుంటూ చీకట్లో కూర్చున్నాను. తెలతెలవారుతుందనగా లేచి మా ఊరు బయలుదేరాను."

డిబిరిగాడు యాంత్రికంగా పొగ వదులుతూ తూర్పున వెలుగుదేరుతున్న ఆకాశం వైపు చూస్తున్నాడు. చల్లగాలులు వీచటం మొదలెట్టాయి. తంపర మీద ముసురుకున్న మంచు కరిగిపోతూ గాలిలో తేలుతూ శూన్యంలోకి కలిసిపోతోంది. ఆకాశం గచ్చకాయ రంగుతో జిడ్డు తేరుతోంది.

"నేను పెద్దయ్యాక మా బాబు తుపాకీ నాకు ఇచ్చేస్తారని పోలీస్‌స్టేషన్‌లో చెప్పారు. వలేసి ఏట చేసుకుంటూ ఎన్నెన్నో ఊర్లు తిరిగాను. తిరిగి తిరిగి గుర్తొచ్చి మళ్లీ ఆ ఊరొచ్చాను. అప్పటికి నాకు మీసాలు, గడ్డాలు వచ్చాయి. తెల్లదొరల రోజుల్లో మా సంచారోళ్లకి ఏట చేసుకు బతకడానికి లైసెన్స్‌లు ఇచ్చీవోరు. ఏటేటో కాగితాల మీద నా నిసానీలు, పొటిగిరాపీ తీసుకుని మా అయ్య తుపాకి నాకు ఇచ్చేశారు," అని సిగరెట్టు కాలుస్తూ లేచి నుంచున్నాడు.

అప్పటికే తంపర మీద వెలుగు పర్చుకుంటోంది. ఆ వెలుగులో మెల్లమెల్లగా తుంగ గుబుర్లు, రెల్లు దుబ్బులు, నాచుతీగలు ఒక్కొక్కటీ ఫోకస్‌లోకి వస్తున్నాయి.

డిబిరిగాడు తంపర వైపు కలయజూస్తున్నాడు. నీటిపిట్టలు అరుస్తున్నాయి. సరుగుడు తోటలో జీడి మామిడి చెట్టు మీంచి కోయిల కూస్తోంది. తెరతెరలుగా గాలి వీస్తోంది. ఏదో వాసన పసిగట్టుతున్నట్టు పదేపదే ముక్కుపుటాలు ఎగరేస్తూ గాలిలో వాసన చూస్తున్నాడు డిబిరిగాడు. బాతులు రెక్కలు కొట్టుకుంటూ నీటిలో ఒకదాన్నొకటి తరుముకుంటూ అరుస్తూ గోల చేస్తున్నాయి.

"సారూ! వర్షం వస్తాది. పెంటి బాతులు పెట్టల్ని తొక్కడానికి అరుచుకుంటూ ఎలా గోల చేస్తున్నాయో

విను. వర్షం వస్తాది దొరా, వర్షం వాసన చూడు!'' అని మళ్లీ ముక్కుపుటాల్ని ఎగరేస్తున్నాడు.

గాలితెర రంయ్‌మని వీచింది. తుంగ గుబుర్ల లోంచి నాచు మీద ఒరుసుకొస్తున్న ఆ గాలిలో ముదర పసరవాసనతో పాటు చినుకులకి తడిసిన మట్టివాసన వర్మ ముక్కుకి ఘాటుగా తగుల్తోంది. వర్మ ఆశ్చర్య కరంగాను, ఆసక్తికరంగాను ఆకాశంవైపు చూశాడు. స్వచ్ఛమైన వినీలాకాశం సుదూరంగా నల్లటి మబ్బు మరక.

తూర్పున ఆకాశం మీద వెలుగు, పసుపుదేరుతూ కరిగించిన బంగారపు రంగు మైనపుపూతలా చిక్కబడు తోంది. పచ్చటి వెలుగు గాలిలో కలిసి నీటిమీద తేలుతూ, తామరాకుల మీద రాసుకుంటూ ఆకు పచ్చటి గడ్డి గుబుర్లలో నుంచి వెలుగు పాకురుకుంటూ దాటుతుండగానే మళ్లీ ఆకాశం రంగు మార్చింది. నారింజరంగు పారదర్శక పల్చటి కాంతి చిక్కటి పచ్చ దనంతో పెనవేసుకొంటోంది. ఆ వర్ణకాంతుల పరి ష్వంగంలో నుంచి సూర్యోదయమయింది. నిండు సూర్యుడు మెల్లగా నులివెచ్చగా ఆకాశం మీదికి తోసు కొస్తున్నాడు. తంపర మీద పక్షి సంతతి సూర్యోదయంతో కిలకిలలాడుతున్నాయి. వర్మ, డిబిరిగాడు చూస్తున్నారు.

''బార్... బక్... గొగ్గొగ్గొ...'' మని తుంగ దుబ్బుల్లో నుంచి గూడకొంగ రెక్కలు కొట్టుకుంటూ లేచింది.

డిబిరిగాడు చటాలున తుపాకీ ఎత్తి దాని గమనంతో పాటే గురి సారిస్తున్నాడు. మెడ సాగదీసు కుంటూ, వెనక్కాళ్లు చాచి గాలిలో రెక్కలు కొట్టు కుంటూ అపుడే లేచిన సూర్యుడికి అడ్డంగా నల్లగా దాటబోతోంది. తుపాకీ గురి వెంటాడుతోంది. 'ఢామ్' డిబిరిగాడి తుపాకి పేలింది. దెబ్బకి ఠప్‌మని దూదిపింజె పిట్లిపోయినట్లు గుప్పెడు వెంట్రుకలు గాలిలో మెరుస్తూ తేలుతున్నాయి. గాలిలోనే చచ్చిన గూడకొంగ నిండుగా లేస్తున్న ఎర్రటి సూర్యబింబం నేపథ్యంలో విరిగిపడిన చీకటిపెళ్లలా బరువుగా దబ్బున నీటిలో పడిపోయింది.

పిట్ట నీటిలో పడీ పడడంతో అంతవరకు వర్మ పక్కనే నిల్చున్న సీజర్ ఒళ్లు విదిలించుకొంటూ గట్టు దిగి పట్టుకురావడానికి ఒడ్డుంబట పరుగు లంకించు కుంది. దూరంగా నీటి మధ్యలో చచ్చిన గూడకొంగ తేలుతోంది.

డిబిరిగాడు గట్టిగా అరిచాడు, ''సారూ! సారూ! దాన్ని పట్టుకోండి. అక్కడ బురద గుమ్ములు, ఊబులు ఉన్నాయి... అందులో దిగబడి సచ్చిపోద్ది... పరుగెట్టి పట్టుకోండి... పిట్ట ఎలాగూ దక్కదు. ఇది కూడా కూరుకుపోతాది.''

''సీజర్, సీజర్- స్టాప్, స్టాప్ ఐసే! కమాన్, కమ్ హియర్! నో, నో!'' అని అరుస్తూ వర్మ కుక్కని పట్టు కోవడానికి పరుగెత్తాడు. అలా ఒడ్డు వెంట పరుగెత్తి పరుగెత్తి ఇక నీట్లో దిగబోతున్న కుక్కని చటాలున తోక పట్టుకు బయటకు లాగాడు. అది విదిలించుకుని జాపోస్తోంది. పెనుగులాడుతోంది. దాని మెడ మీది జూలును గట్టిగా పట్టుకుని అదుపు చేస్తూ మొరా యిస్తున్న దాన్ని ఎలాగైతేనేం సముదాయిస్తూ నడి పించుకు తీసుకువస్తున్నాడు.

రానురాను గాలి ఎక్కువౌతోంది. వెలుగు మసక బారింది. ఆకాశంవైపు చూశాడు. సూర్యుడి మీద మబ్బు తెర పాకుతోంది. ఆకాశం మబ్బు పట్టింది. సరుగుడు చెట్లలో నుంచి ఆకాశం మీద నల్లటి మేఘాలు కమ్ము కొస్తున్నాయి. గాలిలో తేమ వాసన. తంపర్లో తామ రాకులు రెపరెప కొట్టుకుంటున్నాయి. ఈ వర్షపు రాకను ఎప్పుడో పసిగట్టిన డిబిరిగాడి ప్రకృతి వాతావరణ పరి జ్ఞానానికి మనస్సులో అభినందించుకుంటూ కుక్కని నడిపించుకుంటూ గట్టెక్కాడు.

అక్కడ దృశ్యాన్ని చూసి వర్మ గుండె ఝల్లు మంది. షాక్ అయిపోయాడు. తెగి వేలాడుతున్న మెడతో రక్తంలో రెక్కలు కొట్టుకుంటూ గింజుకుంటున్న నత్త గొట్టు. చాకుకి అంటిన రక్తాన్ని సంచీకి తుడుస్తున్న డిబిరిగాడు.

''వాట్! చంపేశావా?''

''ఇది మరి ఏటకు పనికిరాదు దొరా... గొంతుక లో బెదురు అరుపు... సఫా చేసేశాను!''

''ఇన్నాళ్లు పెంచి ఇప్పుడు చంపేస్తావా?'' అస హ్యించుకున్నాడు వర్మ.

''కోడిని పెంచి కోసుకొని తినవా సారూ?'' కత్తిని సంచిలో పెడుతూ ఎదురు ప్రశ్న వేశాడు డిబిరిగాడు. వర్మ సమాధానం చెప్పలేకపోయాడు. తను వేసిన ప్రశ్న తనకే రీబౌన్స్ అయిన బంతిలా ముఖానికి గుద్దింది.

''చంపడం పాపం... పెంచి... కత్తితో పీక కోసేడం... పాపం! ఇన్‌హ్యూమన్'' నీళ్లు నములుతూ, నసుగుతూ, గొణుక్కుంటూ... డిబిరిగాడి ప్రశ్నకి సమా ధానం లేక, చెప్పలేక చీదరించుకుంటున్నాడు వర్మ.

నత్తగొట్టు రెక్కలు కొట్టుకోవడం ఆగిపోయింది. ప్రాణం పోయింది.

"పాపమా, సారూ? నీ సంచిలో బాతుల్ని నువ్వు తుపాకీతో సంపేనేదా? నేను కత్తితో పీక్కోసి సంపేశాను. అంతే! అదీ సంపడమే. ఇదీ సంపడమే! అలా అయితే నీదీ పాపమే. నీకొక న్యాయం, నాకొక న్యాయమున్నా? ఇదేటి సారూ... నువ్వు కులాసాకీ, జల్సాకీ, గొప్పకీ ఏట సేస్తావు. నేను పొట్ట కోసం ఏట సేస్తాను. ఏట లేకపోతే మేం బ్రతకలేం. ఆకలితో సవ్వాల. ఏది పాపం సారూ?" అని నవ్వుకుంటూ భుజానికి సంచీ తగిలించుకున్నాడు. ఆ నవ్వు వర్మ గుండెల్ని కెలికేస్తోంది.

ఆకాశం మేఘావృతమౌతోంది. మెరుస్తోంది. దూరంగా చెట్లలోంచి దాటుకొస్తున్న చినుకుల చప్పుడు.

"ఈరోజు ఏట లేదు. నీ తుపాకీ శబ్దానికి పిట్టలు దిగలేదు. కొట్టిన పిట్ట ఊబుల్లో పడిపోయింది. వర్షం కూడా వచ్చేస్తుంది. మరి ఏట ఉండదు. ఈరోజు దీనినే తిని పొట్ట నింపుకోవాల. లేకపోతే పస్తుండాల... ఆకలి... మరి ఈ పాపం ఎవరిది సారూ?" అని పొట్ట మీద కొట్టుకుంటూ, "పాపం... పుణ్యం..." అని పగలబడి నవ్వుతున్నాడు.

వర్మ గుండె అవమానంతో, సిగ్గుతో బీటలు వారుతోంది. అవును ఎవరిది పాపం? డిబిరిగాడు జీవిత సత్యాన్ని పొరలు పొరలుగా ఒలిచి చెబుతున్న వేదాంతిలా అనిపించాడు. నిశ్చేష్టుడై అలా నవ్వుతున్న డిబిరిగాడి వైపు చూస్తూ ఉండిపోయాడు.

టపటపమని రెండు పెద్దపెద్ద చినుకులు వర్మ ముఖం మీద తట్టి లేపినట్లు పడ్డాయి. డిబిరిగాడు నవ్వు సడన్‌గా ఆగిపోయింది.

"సారూ వర్షం వచ్చేసింది. బయలుదేరు, తడిసిపోతావు!" అని క్షణంసేపు ఆగాడు. నవ్వాడు. ఆ నవ్వు మునుపటి నవ్వులా లేదు. ఆప్యాయంగా ఉంది.

"సారూ మనిద్దరం ఏటగాళ్లం. చీకట్లో కలుసుకున్నాం. నా కథ నీకు చెప్పాను. ఇద్దరం సొంగాతులయ్యాం. నేస్తం సారూ!... దిల్ మిలాయించిపోయింది. దిల్ మిలాయించు సారూ," అంటూ వర్మను కౌగలించుకున్నాడు.

వాళ్లిద్దరినీ వర్షం తెర కప్పేసింది. ఇద్దరి వేట గాళ్ల గుండె చప్పుళ్లు ఒకదానితో ఒకటి ప్రతిధ్వ నిస్తున్నాయి.

ఆకాశం మీద మెరుపు- తంపర నీటిలో జిగ్‌మని మెరిసింది.

"సారూ! పద సారూ!" అని తుపాకీ తీసుకొని వర్షంలో తడుస్తూ సలాం చేస్తున్నట్లు వంగి, "వస్తాను సారూ, బయలుదేరు!" అని వెళ్లబోతూ వెనక్కి తిరిగి తుపాకీ దించి సంచీలోంచి ఒక బీడీ తీసి, "వర్షం... కులాసాగా ఉంటాది... కాల్చు సారూ!" అని తుపాకి తీసుకొని మరి వెనక్కితిరిగి చూడకుండా గట్టు దిగి వర్షంలో తుప్పల్లోంచి, పొలాల్లోంచి పరుగెత్తుకుంటూ వెళ్లిపోతున్నాడు. చచ్చిన నత్తగొట్టు చేతిలో తల క్రిందులుగా వేలాడుతోంది.

అలా కనుమరుగయ్యే వరకు డిబిరిగాడ్ని చూస్తూ వర్షంలో నిలబడిపోయాడు వర్మ.

వర్షానికి సీజర్ కుంయ్ కుంయ్‌మని అరిచింది.

వర్మ తేరుకుని కుక్కతో వర్షంలో తడుచుకుంటూ గబగబా ఇంటిముఖం పట్టాడు.

*

బైట వర్షం మరింత ఉధృతమవుతోంది.

కెప్టెన్ వర్మ తడిసిన బట్టలు మార్చుకుని గాలికి తలుపులు, కిటికీలు మూసుకుని కుర్చీలో కూర్చున్నాడు.

కరెంటు పోయింది. టేబుల్ మీద కొవ్వొత్తి వెలుగుతోంది.

డిబిరిగాడి విషాద జీవితచిత్రం మనసులో టి.వి. స్క్రీన్ మీద ఘోస్ట్ ఇమేజెస్‌లా కదలాడుతోంది.

కొడుకు ఆకలి తీర్చడానికి ఉరికంబం ఎక్కబోయే తండ్రి ఆరాటం, ఆకలి తీర్చుకోడానికి పెంచిన పిట్టని గొంతుక కోసిన డిబిరిగాడి కరుకుతనం.

"... మరి ఈ పాపం ఎవరిది సారూ??" బుల్లెట్ షాట్ లాంటి శేషప్రశ్నతో క్లోజప్‌లో ఫ్రీజ్ అవుతున్న డిబిరిగాడి ఘోస్ట్ ఇమేజీ...

గాలికి భళ్లున కిటికీ తెర్చుకుని కొట్టుకుంటోంది. కొవ్వొత్తి గిలగిల తన్నుకుని ఆరిపోయింది... బయట వర్షపు హోరు.

చీకటి...

కెప్టెన్ వర్మ చేతిలో కాలుస్తున్న డిబిరిగాడి బీడీ తప్ప అంతా చీకటి.

దూరంగా కొండల్లో ఉరుముతోంది.

చీకటి...

*రచన మాసపత్రిక, డిసెంబర్ 1995*

